


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 156, పేజీలు - 08
శనివారం, నవంబర్ 15, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## బీహార్‌లో ఎన్డీయే గెలుపు డబుల్ సెంచరీ

**- మహాగఠ్‌బంధన్ మహా నిష్క్రమణ**



పాట్నా (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠను రేపిన బీహార్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అధికార ఎన్డీయే కూటమి అంచనాలకు మించిన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నిలకడగా ముందంజలో ఉన్న ఈ కూటమి ఏకంగా 202 స్థానాల్లో ఆధిక్యం సాధించి 'డబుల్ సెంచరీ' రికార్డును నెలకొల్పింది. దీంతో బీహార్‌లో మళ్లీ నితీష్ కుమార్ నేతృత్వంలోనే ప్రభుత్వం ఏర్పాటు అయ్యే మార్గం సుగమం అయింది. మొత్తంగా 243 స్థానాలు ఉన్న బీహార్ అసెంబ్లీలో మెజారిటీకి అవసరమైన సంఖ్య (మ్యాజిక్ ఫిగర్) 122. ఎన్డీయే కూటమి ఈ సంఖ్యను

2లో..

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం

**- మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం**
**- 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ ఘన విజయం**
**- తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ ఆధిపత్యం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి చివరి వరకు నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఏకపక్ష విజయాన్ని నమోదు చేశారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డి 17,061 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. లెక్కింపు ప్రక్రియలో ఏ దశలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. రౌండ్ రౌండ్‌కు మెజార్టీని పెంచుకుంటూ నవీన్ యాదవ్ తన గెలుపును సులభతరం చేసుకున్నారు. రాష్ట్రంలో

2లో..

## రెండేళ్ల పాలనకు రెఫరెండమే జూబ్లిహిల్స్ ఫలితం

**సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ విజయం మా బాధ్యతను మరింత పెంచిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విజయం కాంగ్రెస్ పాలనపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిందని, తమ బాధ్యతలను పెంచిందని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడంతో ఓట్ల శాతం పెరిగిందని తెలిపారు. విజయానికి కారణమైన ప్రజలకు, పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు చెప్పిన రేవంత్, గెలుపు లేదా ఓటమికి పొంగిపోకుండా, ప్రజల తరపున నిలబడి పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యమని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి. ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అది 42 శాతానికి పెరిగింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 51 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల ఆశీర్వాదమని చెప్పారు. హైదరాబాద్ నుంచే రాష్ట్ర ఆదాయంలో 65 శాతం వస్తోందని, ఈ నగరానికి ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమస్యల రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఈ దిశగా పని చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహాయం నిరాకరిస్తున్నారని రేవంత్

2లో..

## గోడకు కొట్టిన బంతిలా తిరిగొస్తాం

**- ప్రజా తీర్పును గౌరవిస్తామన్న కేటీఆర్**
**- ప్రతిపక్ష పాత్ర పోషిస్తూనే ఉంటామన్న కేటీఆర్**
**- కార్యకర్తలు, మాగంటి సునీత ఎంతో కష్టపడ్డారన్న కేటీఆర్**
**- ఉప ఎన్నిక ఎలా జరిగిందో అందరికీ తెలుసని వ్యాఖ్య**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజాతీర్పును స్వాగతిస్తున్నామని కేటీఆర్ ప్రకటించారు. ఫలితాల తర్వాత తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కు ఓటేసిన ప్రజలకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. గెలవాలనే లక్ష్యంతోనే ఎన్నికల్లో కొట్లాడామని ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ తన పాత్రను అద్భుతంగా పోషించిందన్నారు. ఈ ఉపఎన్నిక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. గట్టి పోటీ ఇచ్చి 38 శాతానికిపైగా ఓట్లు సాధించామన్నారు. ఎలా చూసినా తామే కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం అని డిపాజిట్ కోల్పోయినపార్టీ కూడా ఉంది

2లో..

## కర్మ హిట్స్ బ్యాక్

**- జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ట్వీట్ వైరల్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూ, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన వెంటనే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత ఎక్స్ ( ట్విట్టర్) వేదికగా చేసిన ఒకే ఒక్క పోస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఉప ఎన్నిక ఫలితం అధికారికంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చిన వెంటనే.. ఆమె 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సాధారణ స్పందన కాదని బీఆర్ఎస్ పార్టీ

2లో..

## సీఐఐ సదస్సు వేదికగా డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శ్రీకారం

**- వర్చువల్‌గా చంద్రబాబు, పీయూష్ గోయల్ శంకుస్థాపన**



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య-పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం వర్చువల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ముఖ్యమంత్రి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీకి శంకుస్థాపన జరుపుకోవడం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్‌ని తామెప్పుడూ అందిపుచ్చుకుంటూనే ఉంటామని, డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం మరింత సాయం చేయాలని సీఎం కోరారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకువచ్చేంతలా ఈ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభిస్తున్నామని, అలాగే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా

2లో..

## 75 ఎంఓయూల ద్వారా రూ.7,14,780 కోట్ల పెట్టుబడులు

**- సీఐఐ సమ్మిట్‌లో ఏపీకి పారిశ్రామికవేత్తల క్యూ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) 30వ భాగస్వామ్య సదస్సు 2025 రెండో రోజు మరింత ఉత్సాహంగా జరిగింది. తొలి రోజు తరహాలోనే ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో 40 ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ?3,49,476 కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, 4,15,890 కొత్త ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఏర్పడింది. సదస్సు ప్రారంభానికి ముందే గురువారం కూడా పలు ఎంవోయూలు చేసుకున్నారు. మొత్తం లో 75 ఎంఓయూల ద్వారా ?7,14,780 కోట్ల పెట్టుబడులు, 5,42,361 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, ఐటీ, టూరిజం హబ్‌గా మార్చే మలుపుగా మారింది. వైస్ ప్రెసిడెంట్ సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, కె. రామ్ మోహన్ నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ సహా పలువురు

2లో..

## ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారు

**- బీహార్ ఫలితాలపై ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన అద్భుత విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో మోదీ ప్రసంగించారు. దీన్ని భారత ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. "జయ ఛఠీ మైయా" అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ప్రధాని మోదీ బిహార్ ప్రజలు మరోసారి అభివృద్ధికి, ప్రజా సేవకు

2లో..

## నాపై దుష్ప్రచారం చేసి గెలవాలనుకున్నారు

**- 'జూబ్లీహిల్స్' విజేత నవీన్ యాదవ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గతంలో బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేయలేదని, ప్రజలకు ఆ విషయం చెప్పుకోలేక తమపై దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో గెలవాలని చూసిందని జూబ్లీహిల్స్

2లో..



## బీహార్‌లో ఎన్డీయే గెలుపు డబుల్ సెంచరీ

ఎప్పుడో దాటి సుమారు 202 స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యత చూపింది. ఎన్డీయే కూటమిలో బీజేపీ, జేడీ(యూ)లు ప్రధాన పాత్ర పోషించాయి. బీజేపీ, జేడీ(యూ)లు దాదాపు సమాన సంఖ్యలో ఆధిక్యం సాధించడంతో సంకీర్ణ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగేందుకు బలమైన మద్దతు లభించినట్లు అయింది. ముఖ్యంగా ఎల్‌జేపీ (రాంవిలాస్) కూడా 20కి పైగా స్థానాల్లో ముందంజలో ఉండటం కూటమి బలాన్ని మరింత పెంచింది.

**- కుప్పకూలిన మహాగట్‌బంధన్**

ప్రతిపక్ష మహాగట్‌బంధన్ ఈ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూసింది. ఈ కూటమి కేవలం 36 స్థానాల్లో మాత్రమే ఆధిక్యం సాధించగలిగింది. 2020 ఎన్నికల్లో 114 స్థానాల్లో గెలుపొందిన ప్రతిపక్ష కూటమి ఈసారి అందులో సగం కూడా దక్కించుకోలేకపోతోంది. మహాగట్‌బంధన్‌లో పార్టీల వారీగా ఆర్జేడీ కేవలం 27 స్థానాల్లో మాత్రమే ముందంజలో ఉంది. కాంగ్రెస్ నాలుగే నాలుగు స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా సీపీఐ (ఎం), సీపీఐ (ఎంఎల్) 5 స్థానాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ రాఘోపూర్‌లో వెనుకంజలో ఉండటం ఘోర పరాభవాన్ని చూపిస్తోంది.

**- పనిచేయని ప్రశాంత్ కిషోర్ వ్యూహం..**

ఇక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సొంతంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీ పరిస్థితి కూడా దారుణంగా ఉంది. వారి వ్యూహాలు సొంత నియోజకవర్గంలోనూ పని చేయకపోవడంతో ఆ పార్టీ ఖాతా కూడా తెరవలేకపోయింది. మొత్తం మీద ఈ ఎన్నికల ఫలితాలు బీహార్‌లో నితీష్-బీజేపీ నేతృత్వంలోని అభివృద్ధి ఎజెండా పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారని స్పష్టం చేస్తున్నాయి.

## గోడకు కొట్టిన బంతిలా తిరిగొస్తాం

కదా అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. బీహార్ లో కాంగ్రెస్ పూర్తిగా తన ఉనికిని కోల్పోయింది, ఎన్నికల్లో గెలుపోటములు సహజం. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో నిరాశపడాల్సిన అవసరం లేదు. తెలంగాణలో కేసీఆర్ మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టే వరకూ శక్తివంచన లేకుండా కష్టపడతామన్నారు. వారికి తోడుగా ప్రతి బూత్‌లో స్థానిక జూబ్లీహిల్స్ పార్టీ శ్రేణులు, నాయకులు కూడా కష్టపడ్డారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. వారు కూడా మా అభ్యర్థికి రాజకీయ అనుభవం లేకపోయినా, చాలా కష్టపడి ఎన్నికల్లో గెలుపు కోసం పోరాటం చేశారన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ఎత్తిచూపడంలో ఎన్నికల్లో మా పార్టీ నిజాయితీగా, చిత్తశుద్ధిగా పోరాడింది. ప్రతి సర్వేలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని అన్ని సర్వే ఏజెన్సీలు చెప్పాయి. చివరి మూడు రోజుల్లో ఏం జరిగిందో అందరూ చూశారన్నారు. ఈ ఎన్నిక ద్వారా స్పష్టమైన ప్రత్యామ్నాయం భారత రాష్ట్ర సమితి అని ప్రజలు తీర్పునిచ్చారు. ఈ అంశాన్ని సానుకూల అంశంగా పార్టీ పరిగణిస్తున్నది. 2014 నుంచి 2023 వరకు 7 ఉప ఎన్నికలు జరిగాయి. అన్ని ఉప ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లోనూ గెలవలేదని గుర్తుచేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కూడా ఒకటి, రెండు సీట్లకే పరిమితమైంది. ఒక్క ఉప ఎన్నికల్లో గెలవకపోయినా, డిపాజిట్లు కోల్పోయినా అప్పటి ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలను, ఆరు గ్యారెంటీల అమలును, ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోయామని తెలిపారు. కులము, మతము పేరుతో రాజకీయం చేయలేదు. ప్రజలకు అవసరమైన అంశాలను మాత్రమే ప్రచారంలో చర్చకు పెట్టామన్నారు. మంత్రివర్గంలో మైనారిటీలకు స్థానం లేదని, ఆటోలకు జరుగుతున్న అన్యాయం పైన మా పార్టీ గళమెత్తితే, ప్రభుత్వం ఒత్తిడికి లోనై వారికి స్థానం కల్పించాల్సి వచ్చింది.గెలవాల్సింది పార్టీలు కాదు, గెలవాల్సింది ప్రజలు అని నమ్మే పార్టీ మాది. ఎన్ని రకాలుగా అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ పాల్పడిందో నెల రోజుల ముందు చెప్పాం. స్వయంగా అభ్యర్థి తమ్ముడికి దొంగ ఓట్లు ఉండటం, దొంగ ఓటరు కార్డుల పంపిణీ, షెడ్యూల్ మొదలు పోలింగ్ రోజు వరకు జరిగిన అక్రమాల గురించి ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు చేశామన్నారు.

ఏదేమైనా ప్రజా తీర్పుని మేము గౌరవిస్తాం.ఈ ఎన్నిక ఫలితం పైన కూడా ఆత్మ విమర్శ చేసుకుంటామన్నారు. మాకు ఈ ఎన్నికల్లో మంచి ఓటింగ్ వచ్చింది. సింగిల్ డిజిట్‌లో ఉండి డిపాజిట్ బీజేపీ కోల్పోయింది. ఈ ఎన్నికల్లో బీజేపి కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయం ఫలించినట్లుగానే కనిపిస్తున్నదన్నారు. ఈ ఎన్నికతో నిరాశ చెందవలసిన అవసరం లేదు. కాంగ్రెస్ జాతీయ స్థాయి కాంగ్రెస్ పార్టీ బీహార్‌లో ఉనికి కోల్పోయే పరిస్థితిలో ప్రజలు తీర్పునిచ్చారు. ఎన్నిక తర్వాత కూడా ప్రతి ఒక్కరూ ప్రభుత్వాన్ని ఎండగట్టే పనిలో నిమగ్నమై ముందుకు పోదామని పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన మాదిరి ఇక్కడ కూడా పార్టీ మారిన నేతలను డిస్క్వాలిఫై చేసి ఉప ఎన్నికలు వస్తాయి అని ఆశిస్తున్నామన్ని ఒక్క జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకే ఇన్ని అపసోపాలు పడిన కాంగ్రెస్ పార్టీ, 10 ఉప ఎన్నికలు వస్తే ఎలా ఎదుర్కొంటుందో చూస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే బలంగా కొట్లాడతామన్నారు.

## కర్మ హిట్స్ బ్యాక్

అంతర్గత రాజకీయాలపై కవిత చేసిన సంచలన వ్యాఖ్యగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత చేసిన పోస్ట్, బీఆర్ఎస్ పార్టీలోని ఒక వర్గానికి, ముఖ్యంగా పార్టీలో తమకు తగిన గౌరవం దక్కలేదని భావిస్తున్న కవిత వర్గానికి మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలకు అద్దం పడుతున్నట్లు తెలుస్తోంది.కవిత 'కర్మ' ప్రస్తావన ద్వారా పార్టీలో జరుగుతున్న కొన్ని తప్పుడు నిర్ణయాలు అనైతిక రాజకీయాల పర్యవసానమే ఈ ఓటమని సూచించినట్లుగా ఉంది. పార్టీలో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆమె పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా పార్టీ అధిష్టానానికి, కేటీఆర్‌కు సంకేతం పంపినట్లుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కవిత తన రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న అవమానాలను ఒడిదుడుకులకు ఈ జూబ్లీహిల్స్ ఓటమి ఒక రకంగా తమ ప్రత్యర్థులకు తగిన జవాబు అని ఆమె భావించి ఉండవచ్చు. కాంగ్రెస్ గెలుపు అధికార పార్టీకి బలాన్ని ఇవ్వగా, బీఆర్ఎస్‌లో మాత్రం ఓటమికి బాధ్యులు ఎవరు అనే చర్చను అంతర్గత కలహాలను ఈ 'కర్మ హిట్స్ బ్యాక్' ట్వీట్ మరింత పెంచింది.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేస్తూ కేసీఆర్‌కు మినహాయించి ఇతర నాయకుల వైఖర్యాలను నిలదీస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఆమె చేసిన " కర్మ హిట్స్ బ్యాక్ " ట్వీట్ ఈ అంతర్గత రాజకీయ విభేదాలకు నిదర్శనం.ఈ ట్వీట్ ద్వారా పార్టీలో తన పట్టును తక్కువ చేసి చూసినవారిని, తన రాజకీయ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తం చేసిన నాయకులను కవిత పరోక్షంగా విమర్శించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె వైఖరిని హేళన చేసినవారికి, జూబ్లీహిల్స్ ఫలితం "చెంప పెట్టు లాంటిది" అని కవిత అభిమానులు సోషల్ మీడియాలో ఘాటుగా వ్యాఖ్యానిస్తున్నారు. కవిత ట్వీట్ బీఆర్ఎస్‌లో త్వరలో జరగబోయే నాయకత్వ మార్పు లేదా అంతర్గత ప్రక్షాళనకు సంకేతం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత పై కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మరోవైపు ఈ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి కేవలం 17,061 ఓట్లు మాత్రమే పోలవడంతో ఆ పార్టీకి డిపాజిట్ గల్లంతయింది.

## ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారు

పట్టం కట్టారని స్పష్టం చేశారు. తాము ప్రజలకు సేవకులమని వారి సంతోషం కోసం కష్టపడతామని వెల్లడించారు. అందుకే బిహార్ రాష్ట్రం మొత్తం 'ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్' అని నినదించిందని తెలిపారు. కొన్ని పార్టీలు అనుసరించే 'ముస్లిం-యాదవ్' (ఎంవై) అనే పాత బుజ్జగింపు సూత్రాన్ని బిహార్ ప్రజలు ఈసారి తిరస్కరించారని ప్రధాని మోదీ పరోక్షంగా మహాఘట్‌బంధన్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. దీనికి బదులుగా మహిళలు-యువత (ఎంవై) అనే కొత్త శక్తివంతమైన ఎంవై కలయిక ఎన్డీఏ అపూర్వ విజయాన్ని సుస్థిరం చేసిందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా బిహార్‌లో ' జంగిల్ రాజ్ (ఆటవిక రాజ్యం)', 'కట్టా సర్కార్ (తుపాకీ పాలన)' యుగం తిరిగి రావడానికి అక్కడి యువత సుముఖంగా లేదని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బిహార్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా ఈసారి ఎలాంటి ఘర్షణలు లేకుండా పోలింగ్ చాలా ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు. జంగల్ రాజ్ అంతం కావడం వల్లే ఈ మార్పు వచ్చిందని తెలిపారు.1995లో 1500 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగేదని 2005కు ముందు కూడా కొన్ని వందల చోట్ల జరిగినట్లు ప్రధాని మోదీ గుర్తు చేశారు. కానీ ఈసారి ఎన్నికల్లో ఒక్కచోట కూడా రీపోలింగ్ అవసరం రాలేదని ఇది బిహార్‌లో మెరుగైన శాంతి భద్రతలకు నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 'ముస్లిం లీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్'గా మారిపోయిందని పూర్తిగా ఆ ఎజెండానే నడుపుతోందని ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతర్గత విభేదాల కారణంగా కాంగ్రెస్ మరోసారి చీలిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇక తమ ప్రభుత్వం ఛఠ్ పూజను యునెస్కో హెరిటేజ్ లిస్ట్‌లో చేర్చడానికి కృషి చేస్తోందని.. దాని ద్వారా ఈ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యమని ప్రధాని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించినందుకు నితీష్ కుమార్ నాయకత్వాన్ని పార్టీ శ్రేణులను అభినందించారు. ఈ విజయం బిహార్‌ను కొత్త శిఖరాలకు చేర్చడానికి తమలో ఉత్సాహాన్ని పెంచిందని తెలిపారు.

## సీఐఐ సదస్సు వేదికగా డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శ్రీకారం

ఏపీని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మరోవైపు డ్రోన్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటికి డిమాండ్ విస్తృతంగా ఉందని, దీనిని ముందుగానే ఊహించి డ్రోన్ సిటీని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఆలోచనను కేంద్రమంత్రి పీయూష్ గోయల్ కొనియాడారు. ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే ఐటీ భవిష్యత్‌ను ఊహించి ఆరోజు అవకాశాలను సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని ప్రశంసించారు. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఏఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు ముందంజలో ఉన్నారని అన్నారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు. దేశం కోసం, రాష్ట్రం కోసం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలిసి కట్టుగా పనిచేస్తున్నారని వెల్లడించారు.

**- 300 ఎకరాల్లో ఓర్వకల్లులో డ్రోన్ సిటీ**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు, ఆర్ అండ్ డీ రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. డ్రోన్ సిటీలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్ - సర్టిఫికేషన్ సెంటర్ల ఏర్పాటుతో పాటు 25,000 మంది రిమోట్ పైలట్‌లకు శిక్షణ అందిస్తారు. డ్రోన్ సిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000 మందికి పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు కానున్నాయి. డ్రోన్ సిటీలో 20 శాతం క్యాపిటల్ సబ్సిడీ, 100 శాతం ఎస్జీఎస్టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

**- దేశంలోనే తొలిసారి ట్విన్ స్పేస్ సిటీస్**

దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటు అవుతున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ట్విన్ స్పేస్ సిటీస్ నిర్మాణం జరగనుంది. ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్‌కు ఇక్కడ ప్రాధాన్యం ఇస్తారు. స్పేస్ సిటీలో 10 ఏళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఏపీ స్పేస్ పాలసీ 4.0లో భాగంగా స్పేస్ టెక్ ఫండ్ కింద రూ.100 కోట్ల కేటాయించడం జరిగింది. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో భారత వైమానిక- అంతరిక్ష రంగాల్లో కొత్త శకం ఆరంభం కానుంది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనకు డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ ప్రాజెక్టులు కీలకం కానున్నాయి.

**- రాష్ట్ర ప్రభుత్వంతో వివిధ సంస్థల ఒప్పందాలు**

సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. అలాగే డ్రోన్ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలు ఎంఓయూ చేసుకున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల నిర్మాణంతో టెక్నాలజీ, నైపుణ్యాలు, పరిశ్రమలు విస్తరణకు విస్తృత అవకాశాలు రానున్నాయి.

## 75 ఎంఓయూల ద్వారా రూ.7,14,780 కోట్ల పెట్టుబడులు

పారిశ్రామివేత్తలు పాల్గొన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్, మైనరల్స్, అగ్రీబిజినెస్, ఐటీ సెక్టార్లపై దృష్టి సారించాయి. రెండో రోజు మొత్తం పెట్టుబడులు రూ. 3,49,476 కోట్లు, ఇవి 4,15,890 ఉద్యోగాలు సృష్టిస్తాయని ప్రభుత్వం అంచనా. రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో రూ. 2.94 లక్షల కోట్ల పెట్టుబడులతో 69,800 ఉద్యోగాలు. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ , తైవాన్ కంపెనీలు అలియన్స్ గ్రూప్, ఈజూల్ ఇండియా జెవితో మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులతో ఒప్పందాలు జరిగాయి. కొరమండల్ ఇంటర్నేషనల్ విశాఖలో రూ. 2,000 కోట్లతో ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ, పెట్టనుంది. పోర్ట్స్, సెమెంట్, డేటా సెంటర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్‌లో రూ 1 లక్ష కోట్ల అదనపు పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ఇవి కాకుండా, మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లోకేష్ ఐటీ, డిజిటల్ ఎకానమీ సెషన్లలో పాల్గొని, విశాఖపట్నంను ఐటీ హబ్‌గా ప్రమోట్ చేస్తున్నారు. దిగ్గజాలు ఇన్వెస్టర్స్ సమ్మిట్ లో కీలక ప్రకటనలు చేశారు. అదానీ సంస్థ డేటా సెంటర్లు, ఓడరేవులు, సిమెంట్ ఉత్పత్తి తదితర రంగాల్లో పెట్టుబడులను ప్రకటించింది. బజాజ్ విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. నౌకా నిర్మాణం, పర్యాటకం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని భారత్ ఫోర్జ్ నిర్ణయించింది. రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఏఐ డేటా సెంటర్, సోలార్ పవర్ ప్లాంట్, గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటేడ్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 1 జిడబ్ల్యూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటుతో ప్రపంచంలో అత్యంత అధునాతనమైన జీపియూలు, టీపియూలు, ఏఐ ప్రాసెసర్‌లను హోస్ట్ చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. కర్నూలులో 170 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌకర్యంతో నిర్మించనుంది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు, ఆర్ అండ్ డీ రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటు అవుతున్నాయి. స్పేస్ సిటీలో 10 ఏళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని అంచనా. స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. అలాగే డ్రోన్ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అకిన్ అనలిటిక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ సంస్థలు ఎంఓయూ చేసుకున్నాయి.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఘన విజయం

అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఈ కీలక ఉప ఎన్నికలో విజయం సాధించడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ గెలుపు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చింది. ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

## రెండేళ్ల పాలనకు రెఫరెండమే జూబ్లిహిల్స్ ఫలితం

ఆరోపించారు. అనేక ప్రాజెక్టులకు అనుమతులు రాకుండా అడ్డుకుంటున్నారని, మెట్రో, మూసీ ప్రక్షాళన వంటి కీలక పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే బీజేపీ ఓట్లు 65 వేల నుంచి 17 వేలకు తగ్గాయని, ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఫలితాన్ని భూకంపానికి ముందు వచ్చే ప్రకంపనగా చూడాలని, తీరు మారకపోతే బీజేపీకి భూకంపం వంటి ఫలితాలు వస్తాయని హెచ్చరించారు. రాజకీయాలు మాని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపీలు కలిసి సహకరించాలని, ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత వారిపై ఉందని సూచించారు. ప్రతిపక్ష నేత కేటీఆర్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు రేవంత్. అసూయ తగ్గించుకోవాలని, అధికారం పోయినా కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదని విమర్శించారు. పదవులు ఎవరికీ శాశ్వతం కావని, కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉందని, ఫేక్ న్యూస్ రాయించి, ఫేక్ సర్వేలు చేయించుకుని భ్రమలో బతకకూడదని హెచ్చరించారు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుందని, బీజేపీకి డిపాజిట్ రాదని ముందే చెప్పానని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో మద్దతు ఇచ్చిన ఎంఐఎం కు ధన్యవాదాలు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీకి కాంగ్రెస్ కార్యకర్తల పక్షంగా ధన్యవాదాలు చెప్పి, పొత్తులు, మద్దతులు రాష్ట్ర పరిస్థితులను బట్టి మారుతాయని తెలిపారు. బిహార్ ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడుతూ, ఇంకా సమీక్షించలేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ నెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరని, ఆయన ఆరోగ్యం సహకరించడం లేదని, ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వచ్చే పదేళ్ల పాటు కాంగ్రెస్ పాలిస్తుందని, మార్పు చేసి చూపిస్తామని రేవంత్ ప్రకటించారు.

## నాపై దుష్ప్రచారం చేసి గెలవాలనుకున్నారు

ఉప ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నారు. ప్రజలందరూ తమ ఓటుతో బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారాలను తిప్పికొట్టారని ఆయన అన్నారు. రిటర్నింగ్ అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై నమ్మకంతో ఓట్లు వేశారని ఆయన అన్నారు. నేటితో ఎన్నికలు ముగిశాయని, మనమందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయని ఆయన అన్నారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపిన నవీన్ యాదవ్, నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు 'వ్యర్థాల రీసైక్లింగ్' తప్పనిసరి

వ్యర్థాలను మట్టిలో వదిలేయకుండా ఉపయోగించి నూతన ప్రయోజనకర వస్తువులను తయారు చేసే ప్రక్రియను రీసైక్లింగ్ (పునర్వివియోగ ప్రక్రియ) అని పిలుస్తాం. వ్యర్థాలు రేపటి సమాజ అనారోగ్య కారణాలు. వ్యర్థాలతో నేల తల్లి తల్లడిల్లుతున్నది. గరళ వ్యర్థాల కారణంగా వన్యప్రాణులు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. నేలపై వ్యర్థాల కుప్పలను తగ్గించడం, కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరుల రక్షణ, శక్తి ఆదా, హరితగృహ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, ఆర్థిక వెసులుబాటు, ఉద్యోగాల కల్పన, కొత్త ఉత్పత్తుల తయారీ లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియను వ్యక్తి నుంచి మొదలై పౌర వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాల వరకు అందరూ నిరంతరం కృషి చేయాలి. ఒక టన్ను వ్యర్థ పేపర్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా పరోక్షంగా వేల చెట్లు, 7,000 గ్యాలెన్ల నీరుకా సమానంగా ప్రయోజనం జరుగుతుందని తేలింది. వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియ ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆచరణలో పెట్టడానికి ప్రతి ఏట 15 నవంబర్ రోజు "జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం (నేషనల్ రీసైక్లింగ్ డే)" పాటించడం అమెరికా నుంచి ప్రారంభానికి నేడు విశ్వవ్యాప్తం అవుతున్నది. ప్రస్తుత పౌర సమాజ ఆరోగ్య పరిరక్షణే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడకు నేడే రీసైక్లింగ్ పునాదులు పడాలి. రీసైక్లింగ్ ఫలితంగా పర్యావరణం పరిరక్షణ, నేలపై వ్యర్థాల కుప్పలు తగ్గడం, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, శక్తి పొదుపు, పౌర సమాజ అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణ, సహజ వనరుల సంరక్షణ, భూపాల వాయువుల కట్టడి లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియ పట్ల ప్రజల్లో లోతైన అవగాహన కల్పించాలి. వ్యర్థాల నియంత్రణ సూత్రాలుగా రెడ్యూస్ (తగ్గించడం), రీయూజ్ (తిరిగి వాడడం), రీసైక్లింగ్ (నూతన వస్తువుల తయారీ), రెఫ్యూజ్ (తిరస్కరించడం), రీకవర్ (తిరిగి పొందడం), రోట్ (జీవవిచ్ఛిన్నం చేయడం), రీపర్పస్ (మరో పనికి వాడడం) లాంటి ప్రధాన అంశాలు పేర్కొనబడ్డాయి. ప్లాస్టిక్ కాలుష్యం రానున్న రోజుల్లో ప్రమాదకరంగా మారనుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో జీవవిచ్ఛిన్నం కావడానికి వందల ఏండ్ల పట్టడం వల్ల ఈ వ్యర్థాలతో వన్యప్రాణులు, జల తరాల మనుగడ ప్రాణాంతకంగా మారింది.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడదాం

**1400 సంవత్సరాల క్రితమే మత్తును నిషేధించిన ప్రవక్త మహమ్మద్ (స.అ.సం)**

**పిల్లలపై తల్లితండ్రుల పర్యవేక్షణ అవసరం**

**డ్రగ్స్ వాడటం ఖురాన్ ఆజ్ఞకు వ్యతిరేకం**

**జామియా మస్జిద్ ఇమామ్ ముఫ్తీ యాకూబ్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) డ్రగ్స్ కు బానిసవ్వడం వల్ల సమాజం చెడిపోడమే కాక కుటుంబాలు రోడ్డున పడతాయని, సంబంధాలు తెగిపోయి ఆర్థిక స్థితి నశిస్తుందనీ అందుకే జీవితాన్ని నాశనం వైపు నెట్టే మత్తును పదార్థాల నుండి యువత దూరంగా ఉండాలని జామియా మస్జిద్ ఇమామ్ మౌలానా ముఫ్తీ యాకూబ్ పిలుపునిచ్చారు. పవిత్ర శుక్రవారం నాడు జామియా మస్జిద్ నందు జరిపిన ప్రసంగంలో ముఫ్తీ యాకూబ్ మాట్లాడుతూ డ్రగ్స్ పై యుద్ధంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని మనం నివసించే సమాజంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. డ్రగ్స్ పై జిల్లా పోలీసులు చేస్తున్న కృషిని ఆయన ఒక సందర్భంలో కొనియాడారు. ఇస్లాం జీవితం, ఆరోగ్యం, బుద్ధి, ఆచరణలకు అత్యున్నత ప్రాముఖ్యత ఇస్తుంది. ఈ విలువలను రక్షించడానికి దివ్య ఖురాన్ మత్తును పూర్తిగా నిషేధించిందనీ, డ్రగ్స్ కూడా మత్తును కలిగించే పదార్థాలే కావడంతో, ఇవి ఖురాన్ నిషేధానికి పూర్తిగా లోబడి ఉంటాయనీ ఆయన స్పష్టం చేశారు.

**ఇస్లాంలో మత్తు పదార్థాలు నిషేధం**

చిట్టచివరి ప్రవక్త మహమ్మద్ సల్లేల్లాహు అలైహి వసల్లం వారు 1400 సంవత్సరాల క్రితమే మత్తు పదార్థాలను (మద్యం, డ్రగ్స్, జూదం, మొదలైనవి) ఖచ్చితంగా నిషేధించారని" " మీ చేతులతో మీరే మీ జీవితాలను నాశనం వైపు నెట్టుకోవద్దు.... దివ్య ఖురాన్ ఆ.నెం (195)" అంటే కుంభకోణాలు, పాపం, మద్యం,స్వార్థం, దుర్వినియోగం, తప్పు పనులు చేయడం ద్వారా మీ జీవితాన్ని, సమాజాన్ని నాశనం చేసుకోవద్దు అని దివ్య ఖురాన్ బోధనలు స్పష్టంగా ఉన్నాయన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్.సి.బి) డేటా ప్రకారం సుమారు 10 కోట్ల మంది డ్రక్స్ కు బానిసలు మాదకద్రవ్యాలకు బానిసలయ్యే వారి సంఖ్య బాగా పెరిగింది. ప్రస్తుతం దేశంలో దాదాపు10 కోట్ల మంది వివిధ రకాల మాదకద్రవ్యాలకు బానిసలయ్యారు" అని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్.సీ.బీ) డేటాను ఉటంకిస్తూ ఆయన అన్నారు. డ్రగ్స్ కు బానిసైనా వ్యక్తి చేతిలో ఫోన్ లేకపోయినా ఫోన్ ఉన్నట్లు ఊహించుకోవడం, కిటికీలను ద్వారాలని భావించడం, లేని మనుషులను ఉన్నట్లుగా ఊహించుకోవడం, చిన్న విషయాలకు చిరాకు, కోపం తెచ్చుకుంటారను, వేళకు తినరనీ,ఒక్కోసారి అతిగా తింటారు. వ్యక్తిగత శుభ్రత ఉండదు. చదువు, పనితీరులో వెనకబడుతుంటారు. ఏకాగ్రతను కోల్పోతారు. పరధ్యానంలో ఉంటారు. విపరీతమైన దూకుడు ప్రదర్శిస్తారు.

నలుగురిలో కలిసేందుకు ఇష్టపడరు. తల్లిదండ్రుల కళ్లల్లోకి సూటిగా చూడలేక పోతారు. ఇలాంటి లక్షణాలుంటే డ్రగ్స్ తీసుకుంటున్నారని అనుమానించొచ్చునని పేర్కొన్నారు.

**- డ్రగ్స్ పై యుద్ధంలో తల్లి తండ్రులదే కీలక పాత్ర**

డ్రగ్స్ పై యుద్ధంలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ముఫ్తీ యాకూబ్ అన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు డేగలా ఒక కన్నేసి వారి ప్రవర్తనను కనిపెట్టాలని, పిల్లలు ఎక్కడికి, ఎవరితో వెళు _న్నారు తిరిగి ఇంటికెప్పుడొస్తున్నారు..

ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం తింటున్నారు? ఏం తాగుతున్నారు? ఎలాంటివారితో స్నేహం చేస్తున్నారు? చదువు వల్ల ఒత్తిడి పెరుగుతుందా? వంటి అంశాలను తల్లిదండ్రులు సమయం వెచ్చించి తెలుసుకోవాలి.

లేదంటే పిల్లలు చేయిదాటిపోవడమే కాదు అసాంఘీక శక్తులుగా మారే ప్రమాదం ఉందనీ , డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలనీ , అసాంఘిక శక్తులను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

# బీహార్ ప్రజల తీర్పు మోదీ నాయకత్వానికి మరో ముద్ర

**- వేములవాడ బీజేపీ సీనియర్ నేత : పిన్నింటి హన్మాండ్లు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) బీహార్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో వేములవాడ పట్టణ సీనియర్ బీజేపీ నాయకుడు పిన్నింటి హన్మాండ్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీహార్ రాష్ట్ర ఫలితాలు దేశ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంపై ఉంచిన అచంచల విశ్వాసానికి ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత, మంచి పాలన కోసం ప్రజలు మళ్లీ బీజేపీకి ఒక పెద్ద అవకాశం ఇచ్చారని తెలిపారు. పార్టీ ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు మరింత కృషి చేస్తుందని హన్మాండ్లు తెలిపారు. బీహార్ రాష్ట్ర ప్రజలు చూపిన వివేకపూర్వక నిర్ణయాన్ని కొనియాడుతూ, ఆ రాష్ట్ర ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మోదీ నాయకత్వాన్ని ఆకాంక్షిస్తున్న బీహార్ ప్రజలు

**- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- దేశ రాజకీయాలను దిశానిర్దేశం చేసిన బీహార్ ఎన్నికల ఫలితం**

**- బీజేపీ రాష్ట్ర నాయకులు : ప్రతాప రామకృష్ణ**

**- బీహార్ ఎన్నికల్లో విజయం - వేములవాడ భాజపా శ్రేణుల సంబురాలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) బీహార్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా వేములవాడ పట్టణంలో భాజపా శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. వేములవాడ పట్టణ భాజపా శాఖ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు టపాసులు పేల్చి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు.

**- రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ**

“బీహార్ ఎన్నికల్లో వచ్చిన ఈ అద్భుత విజయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజాహితం పట్ల కట్టుబాటు, అభివృద్ధి పాలనకు ప్రజలు ఇచ్చిన గట్టి మద్దతు. దేశంలో ఎక్కడైనా ఎన్నికలు జరిగినా ప్రజలు అభివృద్ధినే కోరుకుంటున్నారు. అదే అభివృద్ధిని చేరవేసే పార్టీగా బీజేపీని ప్రజలు మరోసారి నిలబెట్టారు” అని అన్నారు.

**- భాజపా రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ**

“బీహార్ ఎన్నికల ఫలితం దేశ రాజకీయాలకు దిశానిర్దేశం చేసింది. సామాన్యుడి మనసు ఏమి కోరుకుంటుందో ఈ ఫలితాలు స్పష్టంగా చెప్తున్నాయి. మోదీ- షా నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడింది. ఈ ఉత్సాహంతో తెలంగాణలో కూడా పార్టీ తూటాలు బిగుస్తుంది. వేములవాడలో భాజపా శక్తి రోజురోజుకూ పెరుగుతోంది”
అని తెలిపారు.

ఇలా ఇద్దరు నాయకులు అభిప్రాయాలు వెల్లడించడంతో భాజపా శ్రేణుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీహార్ గెలుపుతో బీజేపీ పై ప్రజల విశ్వాసం మరోసారి రుజువు

**- కరీంనగర్ జిల్లా బీజేపీ సీనియర్ నేత**

**- అనుమల్ల చంద్రమౌళి హర్షం**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) బీహార్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కరీంనగర్ జిల్లా సీనియర్ బీజేపీ నాయకుడు అనుమల్ల చంద్రమౌళి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఫలితాలు ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శకత, మంచి పాలనకు ప్రజలు మళ్లీ మద్దతు తెలిపారని పేర్కొన్నారు. పార్టీ ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు మరింత కృషి చేస్తుందని, బీహార్ రాష్ట్ర ప్రజల వివేకమైన నిర్ణయాన్ని కొనియాడుతూ, ఆ రాష్ట్ర ప్రజలకు అనుమల్ల చంద్రమౌళి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయంపై బోయినిపల్లి బీజేపీ నేతల సంబురాలు

**- మోదీ నాయకత్వానికి ప్రజల మద్ద6మరోసారి స్పష్టం**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన ఘన విజయాన్ని పురస్కరించుకొని బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి,స్వీట్లు పంపిణీ చేస్తూ బృహత్తరంగా సంబరాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ, “బీహార్ ప్రజల అద్భుత తీర్పు దేశవ్యాప్తంగా నెలకొన్న మూడ్ ఆఫ్ ది నేషన్ కు ప్రతిబింబంగా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వం, అభివృద్ధి - సంక్షేమ పథకాలపై ప్రజల నమ్మకం మరోసారి బలపడింది” అని పేర్కొన్నారు.“వికసిత భారతం లక్ష్యంగా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్న ఎన్డీఏ కూటమికి బీహార్ ప్రజలు ఘనమైన మద్దతు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్త, నాయకుడు ఈ విజయానికి కారణం” అని ఆయన అభినందించారు.
ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగాని అశోక్ గౌడ్, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొన్నం శ్రీనివాస్ రెడ్డి, సారంపల్లి రాజు,పాలోజు రాజేంద్రప్రసాద్,కళ్యాణ అనిల్, రాజూరి కిరణ్,ఇల్లందుల బాలయ్య,రమేష్,రంజిత్ తదితర భాజపా శ్రేణులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రజలకు ధన్యవాదాలు

**- బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) బిసి అభ్యర్థి నవీన్ యాదవ్ ను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు బిసి విద్యార్థి జాఏసీ చైర్మన్ స్వామి గౌడ్ ధన్యవాదాలు తెలుపుతూ నవీన్ యాదవ్ కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
అదేవిధంగా బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలతో పాటు చట్ట సభలకు జరిగే ఎన్నికలలో కూడ 42 శాతం వాటా ఇవ్వాలని అన్ని పార్టీలను బిసి విద్యార్థి జేఏసీ చైర్మన్ స్వామి గౌడ్ డిమాండ్ చేశారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీ చైతన్య పాఠశాలలో బాలల దినోత్సవం నవంబర్ 14న ఘనంగా జరుపుకుంటారు, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులు నృత్య ప్రదర్శనలు వంటి వాటిలో పాల్గొంటారు. చాచా నెహ్రూ పుట్టినరోజునాడు భారతదేశంలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు, పిల్లల పట్ల ఆయనకున్న ప్రేమను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో విద్యార్థుల సృజనాత్మకత, చురుకుదనం ప్రదర్శనాలు చేసినారు విద్యార్థులు నృత్యం, పాటలు, నాటకాలు వంటి అనేక ప్రదర్శనలు చేశారు. ప్రిన్సిపాల్ రూప దేవి మాట్లాడుతూ: బాలల హక్కులు, విద్య మరియు పిల్లల సంక్షేమం గురించి అవగాహన పెంచడానికి భారతదేశంలో బాలల దినోత్సవాన్ని నవంబర్ 14న జరుపుకుంటామన్నారు. మన మొదటి ప్రధానమంత్రి అయిన జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజున ఈ బాలల దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషం. నెహ్రూ కూడా పిల్లలపై అత్యంత ప్రేమ ఆప్యాయతలు చూపేవారు. ఫలితంగా పిల్లలు కూడా చాచానెహ్రూగా ఈయనను పిలిచేవారు. ఇతడి ఆధ్వర్యంలోనే 1954వ సంవత్సరంలో మొదటిసారిగా బాలల దినోత్సవం జరిగిందన్నారు నెహ్రూ పిల్లల విద్యాభివృద్ధికి మరియు సంక్షేమానికి కృషి చేశారని ఆయన్ని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలలో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, గానం మరియు ఇతర కార్యక్రమాలతో అలరించారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు కూడా పాటలు, ఉపన్యాసాలతో విద్యార్థులని ఆనందపరిచారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఇంచార్జిలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ హాజరు - శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పర్శ మల్లేశం తమ్ముడు,మరదలు పర్శ పరుశరాములు%-%మౌనిక దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెన్నాడి అమిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అమిత్ కుమార్ మాట్లాడుతూ, “ప్రతి కుటుంబం అభివృద్ధి చెంది, సుఖశాంతులతో జీవించాలి. కొత్త ఇంటిలో ఈ కుటుంబం ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని ఆకాంక్షించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పర్శ మల్లేశం, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అజ్జూ, సోషల్ మీడియా కన్వీనర్ కమల్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మల్లారపు చందు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అలువాల రాజయ్య, పర్స రాములు, సత్తిరెడ్డి, జాగిరి రామస్వామి, గంగినేని గంగాధర్, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద విజయోత్సవ సంబరాలు

**బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపున్న మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో మేడ్చల్ మున్సిపాలిటీ,ఉమ్మడి మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు ఈరోజు మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలోని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసి,ఆనందోత్సాహాల మధ్య బాణాసంచా కాల్పులతో హోరెత్తించి,మిఠాయిలు పంచుకోవడం జరిగిందిఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ,రాష్ట్ర మంత్రివర్గం,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,పార్లమెంటు సభ్యులు,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు,జిల్లా అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తల సహకారంతో ఎంతగానో శ్రమించి ప్రజల ఆదరాభిమానాలు చూరగొని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు మహాశయులు,ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ అన్న విజయం సాధించామని,ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ అన్న కి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసి,వారి గెలుపునకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ,జాకట దేవరాజ్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓ బి సి సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్,తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిశల సురేందర్ ముదిరాజ్,మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి,ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రవల్లి విఘ్నేష్వర్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,ఎల్లంపేట్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరావు,బర్ల సంతోష్ ముదిరాజ్,రామన్నగారి సంతోష్ గౌడ్,సల్ల వెంకటేష్ యాదవ్,వినోద్ గౌడ్,బట్టు మధు,పత్తి శంకర్,దుబ్బ రామస్వామి ముదిరాజ్,అవినాష్,సయ్యద్ అఖిల్,మహ్మద్ రంజు,మహ్మద్ అక్రం,సాలం,శ్రీకాంత్,రంజిత్,శేఖర్,వెంకటేష్,మురళి,సావిత్రి మేడ్చల్ మున్సిపాలిటీ,ఉమ్మడి మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘట్కేసర్ మున్సిపాలిటీ లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ గెలుపుతో సంబరాలు



ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్)జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుతో ఘట్కేసర్ మున్సిపల్ పరిధి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిళ్ళ ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు భారీ గా బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నా కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్భంగా మామిళ్ళ ముత్యాలు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని బీసీ అభ్యర్థి నవీన్ యాదవ్ కావడంతోబీసీలంతా ఏకమై అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ముత్యాలు యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, అందువల్లే ఈ గెలుపు సాధ్యం అయిందని తెలిపారు.
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ రెండేళ్ల పాలనకు నిదర్శనం అని, కాంగ్రెస్ పరిపాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని . వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కోరుబోతు నాగరాజు బొక్క ప్రభాకర్ రెడ్డి ఉల్లి ఆంజనేయులు మోత్కుపల్లి శ్రీనివాస్ బొక్క సత్తిరెడ్డి వెంకట్ నారాయణ బర్లా దేవేందర్ ముదిరాజ్ మేకల దాస్ బొక్క ప్రభాకర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి రఫీ యుద్దీన్ కడపో ల్ల రాజు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీహార్ లో అఖండ విజయంతో అంబరాన్ని అంటిన బీజేపీ శ్రేణుల సంబరాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించిన బిజెపి నేతలు బీహార్ ప్రజల హృదయాలను గెలిచిన మోడీజీ.కోలా ఆనంద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీహార్ రాష్ట్ర ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ మరియు ఎన్డీయే కూటమి పార్టీలు విజయ దుందుభి మోగించిన సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులతో కలిసి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ బీహార్ లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అతి భారీ స్థాయిలో విజయం సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కారణం బీజేపీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజారంజకమైన సుపరిపాలన అందించడం అనేది ఒక అంశమైతే, కాంగ్రెస్ పార్టీ దాని మిత్రపక్షాలు చేస్తున్న వికృతచేష్టలు వలన ఎన్డీయే కూటమికి అతి భారీ ఎత్తున 200 పైగా సీట్లతో విజయ దుందుభి మోగించడంతో పార్టీ ఆఫీసు దగ్గర టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకుని మోదీ. మోదీ బీజేపీ జిందాబాద్, ఎన్డీయే కూటమి ఐక్యతా వర్ధిల్లాలి అని నినాదాలతో హోరెత్తించి, సంబరాలు నిర్వహించి,ఎన్డిఏ కూటమికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నిన ఎన్నికల సమయంలో ఉగ్రదాడులు జరిపి బిజెపి మీద నెపం వేద్దామనుకున్న ఉగ్ర మూకల ఆటలు చెల్లకుండా బీహార్ ప్రజలు బీజేపీ వైపు నిలబడ్డందుకు బిజెపి తరుపున బీహార్ ప్రజలకు శ్రీకాళహస్తి అసెంబ్లీ తరుపున ధన్యవాదాలు కోలా ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి,పార్టీ సీనియర్ నేతలు చిలకా రంగయ్య,పిల్లారు బతినయ్య, గరికపాటి రమేష్ బాబు, సొట్ట సుకుమార్, ఇమ్మిడిశెట్టి మోహన్, మద్దు వాసు యాదవ్, లింగాబత్తిన గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, గోవర్ధన్, రవిచంద్ర, బొక్కిసం కిరణ్, గదిపాకుల యతీష్, మారీ, హరీష్, ధనుష్, కృష్ణా రెడ్డి, తులసి, నాని, చెంచురెడ్డి,అనిల్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

**-ఈనెల 28న చలో సూర్యాపేట**

**- ఇంటికో గౌడు ఊరుకో వాహనంతో తరలిరావాలి**

**కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్, కార్యదర్శిబుర్ర శ్రీనివాస్ గౌడ్**



ములుగు (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న కల్లుగీత కార్మిక సమస్యలపై ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమైన చర్య అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గుండెబోయిన రవి గౌడ్ జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం రోజున జిల్లా కమిటీ ముఖ్యుల సమావేశంజిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన జిల్లా కేంద్రం లోని సీఐటీయూ కార్యాలయం లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన రవి గౌడ్ శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ తాటి చెట్ల పైనుండి పడిన బాధితులపెండింగ్ లో ఉన్నా ఎక్స్ గ్రేషియాలు 12 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని అలాగే తాడి కార్పొరేషన్ సంబందించిన పెండింగ్ చెక్కులు విడుదల చేయాలని ప్రతి కల్లుగీత కార్మికునికి సేఫ్టీమోకులు తక్షణమే అందజేయాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మిక ఎటువంటి శరతులు లేకుండా వృత్తి పించన్ సాంక్షన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం లో అప్పుడు ఎమ్మెల్యే గా ఉన్నా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ లో అనాదిగా కల్లు గీత వృత్తి చేస్తున్నా గీత కార్మికుల కు సోసైటీ లు పునరుద్దరణ చేయాలనీ అసెంబ్లీ లో మాట్లాడటం జరిగిందని ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిన కూడాఇప్పటిదాకా ఏజెన్సీ గీత కార్మికుల విషయం లో స్పందించక పోవడం సరికాదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీలు అమలు చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న సూర్యాపేట జిల్లా కేంద్రం లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఈ బహిరంగ సభకు జిల్లా లోని ప్రతి సొసైటీ నుండి ఇంటికో మనిషి ఊరుకో వాహనంతో పెద్ద ఎత్తున తరలి రావాలని గీతకార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత సోషల్ మీడియా కన్వీనర్ ఉ య్యాల మధుకర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు రుద్రబోయిన మల్లేష్ గౌడ్ పులి రమేష్ గౌడ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల సంపత్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు మునిగాల సుధాకర్ గౌడ్. నక్క యాకయ్య గౌడ్ వత్సవాయి సారయ్య గౌడ్ గట్టు శంకర్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ ఎన్నికల్లో NDA కూటమి విజయం పట్ల హర్షం..!!

**- బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు భూక్యా రమేష్.**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) నవంబర్ 14: ప్రధాని నరేంద్ర మోదీ సమర్ధ నాయకత్వాన్ని గుర్తించి బీహార్ ప్రజలు మరోసారి %చీణూ% కూటమిని గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ .దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు అహర్నిశలు శ్రమిస్తూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న మోడీ వెంటే దేశ ప్రజలు ఉన్నారని స్పష్టం అవుతుంది అలాగే రాబోయే 2028 లో తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ పార్టీ కచ్చితంగా గెలిచి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అందుకు తగినవిధంగా కార్యాచరణ రచించుకొని బీజేపీ నాయకులందరం కలిసి పనిచేసి తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# బీసీ సమాజ అభ్యున్నతికి నరేందర్ గౌడ్ చేస్తున్న కృషి హర్షణీయం

**- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు**

**: బత్తుల మహేందర్ యాదవ్**

**- ఘనంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు**



వేములవాడ /సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్లలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు ఉత్సాహంగా, ఆనందంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు కేక్ కట్ చేసి నరేందర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహేందర్ యాదవ్ మాట్లాడుతూబీసీ సమాజ హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం నరేందర్ గౌడ్ నిరంతరం పోరాడుతున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో మరిన్ని ఉన్నత స్థాయిలో బాధ్యతలు స్వీకరించి, సమాజానికి ఎనలేని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ తో పాటుగా వేములవాడ నియోజకవర్గం యువత అధ్యక్షుడు మొగిలి కర్ణాకర్, యూత్ అధ్యక్షుడు గుండారు గౌస్కర్,అర్బన్ మండల అధ్యక్షుడు పార్వతి మహేష్, బోయినిపల్లి మండల అధ్యక్షులు దయ్యాల రాజశేఖర్,రాష్ట్ర నాయకులు వాసం మల్లేశం,మొగిలిపాలెం రవి,నక్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# రుణాలకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకునేడు ఇంటర్వ్యూలు

**- బోయినిపల్లి ఎంపీడీఓ : జయశీల**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ.ఆర్.ఎస్.(ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం ఫర్ డిజబుల్డ్)పరిధిలో యూనిట్‌ల కోసం దరఖాస్తు చేసిన 12 మంది నాన్-బ్యాంకింగ్ దివ్యాంగ అభ్యర్థులకు సంబంధించిన ఇంటర్వ్యూలు నేడు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించబడనున్నాయని, ఈ ఇంటర్వ్యూలు బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగనున్నట్లు బోయినిపల్లి ఎంపీడీఓ భీమా జయశీల ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నేత శ్రీనివాస్ రెడ్డికి మాతృ వియోగం - ఎమ్మెల్యే

**మేడిపల్లి సత్యం పరామర్శ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, దేశాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి తల్లి పెండ్యాల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ విజయం - రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజల మద్దతు

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. జూబ్లీహిల్స్ విజయం నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా,



బోయినిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచి, ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం తమది కాకపోయినా,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 22 నెలల ప్రజా పాలన ప్రజలను ఆకట్టుకోవడంతో అక్కడి ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి భారీ ఎత్తున మద్దతు తెలిపారని తెలిపారు. బీఆర్ఎస్ ఎంత దుష్ప్రచారం, కుట్రలు చేసినా ప్రజలు వాటిని పట్టించుకోకుండా నవీన్ యాదవ్‌కు 22 వేలకుపైగా మెజారిటీ అందించారని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి,సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజల్లోనే ఉంటుందని తెలిపారు. గత పాలకుల నియంతృత్వ రాజ్యానికి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ముగింపు పలికారని, ఇప్పుడు ఉప ఎన్నికల్లో కూడా ఇంటి బాట పట్టించారని అన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ విజయ దుందుభి మోగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగనుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుదాకర్, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, నాయకులు అక్కెనపల్లి ఉపేందర్, ఉయ్యాల శ్రీనివాస్, ఏనుగుల కనుకయ్య, సంభ లక్ష్మిరాజం, నాగుల వంశీ, జోగు రవీందర్, ఎమిరెడ్డి సురేందర్ రెడ్డి, భారత్ రెడ్డి, మెరుపుల మహేష్, కన్నం మధు, నగేష్, నల్ల మోహన్, మొహమ్మద్ హుస్సేన్, మెరుపుల జలంధర్, గంగిపెల్లి మొండయ్య, బోయిని పరశురాములు, నల్లగొండ శ్రీనివాస్,అనంతుల సాయి, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రజల తీర్పు బిఆర్ఎస్ అహంకారానికి చెంప దెబ్బ : జెబి శౌరి

**జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జూబ్లీహిల్స్ గెలుపు సంబరాలు**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు చాలా చక్కని తీర్పు ఇచ్చారని ఈ గెలుపు బిఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ సభ్యులు టిపిసిసి సంవిధాన్ బచావో కమిటీ మెంబర్ జేబి శౌరి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సంచలన గెలుపును పురస్కరించుకొని కొత్తగూడెం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి గౌస్ మోహినిద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో టపాసులు కాల్చి కేక్ కట్ విజయోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా జేబి శౌరి మాట్లాడుతు ఫామ్ హౌస్ కు పరిమితమైన కేసీఆర్ ను నమ్ముకుంటే ఏం జరుగుతుందో జూబ్లీహిల్స్ ప్రజలు నిరూపించారని ఇది బిఆర్ఎస్ పార్టీకి చెంపపెట్టు అని విమర్శించారు. ఎలాగైనా గెలవాలన్న ఆలోచనతో సిగ్గు ఎగ్గు వదిలేసి నవీన్ యాదవ్ ను ఆయన కుటుంబాన్ని రౌడీలు గుండాలు అంటూ విమర్శించారని కానీ ప్రజలు ఎవరు రౌడీలో ఎవరు గుండాలో తేల్చేసారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు రాజకీయ విలువలు దిగజార్చారని, గెలుపు కోసం పచ్చి అబద్దాలు చెపుతు, తప్పుడు విమర్శలు చేసారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో ప్రజా ప్రభుత్వం ఎన్నో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటే వాటిని జీర్ణించుకోలేక ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. నవీన్ యాదవ్ ను గెలిపించిన జూబ్లీహిల్స్ ఓటర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సేల్ చైర్మన్ ఏలూరు కోటేశ్వరరావు, కొత్తగూడెం పట్టణ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఎండి గౌస్ మోహినిద్దీన్, ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్, 29వ వార్డు మాజీ కౌన్సిలర్ తంగేళ్ల లక్ష్మణ్, ఓబీసీ సెల్ జిల్లా రంజిత్ నాయుడు, యువజన కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షులు ఎండి ఉస్మాన్ అలీ, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షులు గాండ్ల సురేష్, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పురపు నరసింహారావు, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే నిస్సార్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎస్.కె నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దానాలకే పరిమితమైన ఉద్యోగాలు!

యాదాద్రి-భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలంలో స్థాపించబడిన దండు మల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపిరిగా భావించబడింది. వేల ఎకరాల భూమి సేకరణ చేసి, వందల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చిన ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు 20 వేల ప్రత్యక్ష, 20వేల పరోక్ష ఉద్యోగాలు వస్తాయని గత ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. స్థానికంగా ఉండే ప్రజలు, ఈ ప్రాంత బిడ్డలకు కంపెనీలలో ఉద్యోగాలు వస్తాయని ఆశించి వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం ఇచ్చి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సహకరించారు. అయితే నేడు ఈ పరిశ్రమతో పాటు మరికొన్ని కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించినప్పటికీ, స్థానికులకు ఉద్యో గాలు కల్పిస్తామన్నా ఆ వాగ్దానాలు కేవలం మాటలకే పరిమితమైపోయాయి. కంపెనీలు ఉన్నత స్థాయి ఉద్యోగాలన్ని తమకు ఇప్పటికే ఉన్న ఇతర యూనిట్ల సిబ్బం దినే ఇక్కడ నియమించుకుంటున్నాయి. ఫలితంగా స్థానికంగా డిగ్రీలు, పీజీలు, ఆసక్తి, నైపుణ్యం, ఉన్న స్థానిక యువతకు కనీసం సూపర్వైజర్ స్థాయి ఉద్యోగం కూడా ఇవ్వకపోవడం బాధాకరమైన విషయం. కంపెనీలలో రోజువారి కూలీలుగా పని చేసేందుకు స్థానికులకు 2% ఉపాధి కల్పించి, మిగతా పై స్థాయి ఉద్యోగాలు అన్ని స్థానికేతరులకు కట్టబెట్టడం స్థానిక నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడమే అవుతుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి పెట్టడం అవసరం. పరి శ్రమలు స్థానికులను ప్రాధాన్యంగా తీసుకోవాలని, అవసరమైతే శిక్షణ ఇవ్వాలనీ ప్రభుత్వం స్పష్టమైన విధానం రూపొందించాలి. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, స్థానిక అధికారులు చొరవ తీసుకొని పరిశ్రమల యాజమా న్యాలతో చర్చించి స్థానికులకు న్యాయం చేయాలి. భూమి, నీరు, వనరులు ఇచ్చిన ప్రజలకే ముందుగా ఉపాధి హక్కు కలగాలి. లేకపోతే 'పారిశ్రామిక ప్రగతి' అనే మాట ప్రజల నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. పరిశ్రమలు, ప్రభుత్వం, ప్రజలు కలిసి నడిచినప్పుడే ప్రగతితో పాటు సమానత సాధ్యమవుతుంది.

# సంక్షోభంలో భారత రోడ్డు భద్రత!

అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యేందుకు వెళ్లిన ప్రతిసారీ భారత్‌లో రోడ్డు భద్రతా వ్యవస్థ గురించి మాట్లాడేందుకు ఇబ్బంది పడి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలు పెరుగు తూనే ఉన్నాయని అందులో మనదేశ పనితీరు చాలా అధ్వాన్నంగా ఉన్నదని ప్రజల ప్రవర్తనలో మార్పు రాకుండా చట్టాలపై భయం కలగనంత కాలం దేశంలో మార్పు రాదని సంబంధిత శాఖ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లోనే చేసిన ప్రకటనలో ముఖ్యమైనది. ఒక ప్రమాదం జరగగానే ఆవేశంగా తీర్పులిచ్చి తర్వాత పది మీటర్ల దూరానికీ రాంగ్ రూట్‌లోనే వెళ్లడం మన గొప్పదనం. ఇలాంటి ప్రత్యేకతలతోనే ఒక్క శాతం కూడా లేని వాహనాలతో 11% ప్రమాదాలతో కొన్నేళ్లుగా ప్రపంచంలో మొదటి స్థానంలో మనమే ఉంటున్నాం. ప్రమాదం జరగ్గానే ఎక్కడ లేని అలర్ట్ చూపిస్తుంటారు. తక్షణమే ప్రజలిచ్చే తీర్పులూ, గట్టి చర్యలు తీసుకుంటామని యధావిధిగా చెప్పే నాయకులు, తమ పాపం ఏమీ లేనట్లు అప్పుడే ఉద్యోగంలో చేరినట్లు ఓ నాలుగు రోజులు హడావుడి చేసి గమ్మునుండే ప్రభుత్వ అధికారులు ఆనక కథ కంచికి ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే మళ్లీ మొదటికీ, ఎన్నేళ్లుగా చూడడం లేదీ ప్రహసనం. ఒక ప్రమాదం జరగగానే ఆవేశంగా తీర్పులిచ్చి తర్వాత పది మీటర్ల దూరానికీ రాంగ్ రూట్లోనే వెళ్లడం మన గొప్పదనం. ఎక్కడో గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు. మహానగరాలుగా మనం భావించే డిల్లీ, ముంబయి, చెన్నయ్, బెంగళూరు, హైద్రాబాద్ లాంటి నగర ప్రజలకూ ట్రాఫిక్ రూల్స్ పట్ల కనీస అవగాహన ఉండదు. లేన్ డ్రయివింగ్ గురించి అసలు తెలియదు. ఇక జాతీయ రహదారుల్లో వేగంగా వెళ్లాల్సిన లేన్లలో భారీ వాహనాలు మెల్లగా వెళుతూ వెనక వారిని ఇబ్బంది పెడతాయి. దకానీ టోల్ వసూలులో కఠినంగా వ్యవహరించే సంస్థలు కానీ, సంబంధిత ప్రభుత్వ శాఖలవారు కానీ ఏ మాత్రం చలించరు, చర్యలు తీసుకోరు. ఇప్పుడు కొత్తగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి మధ్యనున్న డివైడర్లలో గడ్డి మేస్తున్న పశువులు కనబడతాయి. ఇది బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. చిన్న మోపెడ్ నుంచి భారీ వాహనాల వరకు ఏది కొనాలన్నా 99% దేశ ప్రజలు చూసేది మంచి రోజుతోపాటు సమయం కూడా అడ్వాన్స్ చెల్లింపు నుంచి షోరూమ్కి వెళ్ళి వాహనం తెచ్చుకునే వరకూ దాన్ని ఆచరిస్తారు.

కొనుక్కున్న వాహనం కొత్తదైనా, పాతదైనా దేవాలయానికి తీసుకెళ్ళి వాహనానికి పూజ చేయిస్తాం. ఇవన్నీ ఎందుకంటే ప్రమాదం జరగకూడదనే భయం కల్పించిన నమ్మకం వల్ల. కానీ దేవుని ముందు దీపం వెలిగించి నీదే భారం అని వదిలేస్తామా, గాలికి ఆరకుండా దీపాగ్ని వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవద్దూ.. తను కష్టార్జితంతో కొనుక్కున్న వాహనంలో తమకు ఎలాంటి ప్రమాదం జరగరాదని దేవుడ్ని వేడుకొని ఆ భారాన్ని అక్కడితో వదిలేసి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నియమ నిబంధనలు తెలుసుకోకుండా, తెలిసినా ఆచరించకుండా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న ప్రజలు ఇక్కడ బాధితులే కాదు, ముద్దాయిలు కూడా. సివిక్ సెన్స్... రహదారి ప్రమాదాలకే కాదు దేశంలోని అనేక రోగాలకు చికిత్స అదే.

### మధ్యాహ్నం 2-5 వరకు విద్యుత్ సరఫరా

## ఉండని కాలనీలు: ఏఈ శ్రీనివాస్



బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) ఏ.బి. స్విచ్‌ల నిర్వహణ, ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కొట్టివేయడం వంటి పనుల నిర్వాహణ కారణంగా 11 కెవి శ్రీ సాయి బాలాజీ హొమ్స్ ఫీడర్ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయబడునని ఏ.ఈ (ఆపరేషన్స్) బడంగ్ పేట్ విభాగం వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.
- శ్రీ సాయి బాలాజీ హొమ్స్, ఫేజ్-1 - సాయి బాలాజీ హొమ్స్, ఫేజ్-2 - సాయి నగర్, - గాయత్రి హిల్స్, - మున్సిపల్ కాలనీ, - శ్రీ విద్యా టౌన్ షిప్, - గ్రీన్ రిచ్ కాలనీ, - బాలాజీ నగర్, - టిఆర్ఆర్ కాలనీ, - లక్ష్మీ ఎన్‌క్లేవ్ ,- బడంగ్‌పేట్ సర్కిల్,- టెలిఫోన్ ఎక్ఛ్సేంజ్ కాలనీ, - శాంతి నగర్ కాలనీ వాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

## లక్ష్మీదేవిపల్లిలో నవీన్ యాదవ్ గెలుపు సంబరాలు

### జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తూము చౌదరి



లక్ష్మీదేవిపల్లి (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపుతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న నమ్మకం స్పష్టంగా కనపడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తూము చౌదరి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అఖండ మెజారిటీతో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తూము చౌదరి మాట్లాడుతు కేటీఆర్ జిమ్మిక్కులు, విచ్చలవిడిగా విడిగా పంచిన డబ్బులు, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత సెంటిమెంట్ డైలాగులు, బిఆర్ఎస్ సోషల్ మీడియా చేసిన విష ప్రచారం ఏవి కూడ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును ఆపలేదన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ గెలుపు ముఖ్యమన్న విషయాన్ని అర్థం చేసుకున్నారన్నారు. రౌండ్ రౌండ్‌కూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పెరిగిన ఆధిక్యమే ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి పాలనపై ఉన్న నమ్మకాన్ని చూపించిందన్నారు. జూబ్లీహిల్స్ గెలుపే నాంది గా రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెదబాబు, పాక్స్ అధ్యక్షులు మండే హనుమంతరావు, పాక్స్ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, పూణె%శీ%.శ్రీనివాస్, మైనార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ గౌస్ భాయ్, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, లాలు, తాటి తిరుమలేష్, రావు మధు, కొంపెల్లి వీరయ్య, ఉబ్బనీ రాజు, వజ్జ చందు, అంతడపుల కృష్ణ, ఐకి సత్యనారాయణ, కుంజ సూరిబాబు, ఎండీ అయబ్ భాయ్, కాంపెల్లి నరేష్, వంశీ, బ్యాండ్ రమణ, సుందర్ లాల్ కోరి, మాజీ ఉపసర్పంచ్ మహేష్, శివ, మాతిన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఫలితాలతో తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింత స్పష్టం

- నవీన్ యాదవ్ విజయంలో చొప్పదండి ఎమ్మెల్యే సత్యం పాత్ర కీలకం అభినందనీయం
- మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు : ఐల శివరాం హర్షం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ 22 వేల ఓట్ల విశేష మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో, బోయినిపల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఐల శివరాం ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శమని ఆయన అన్నారు. ఈ విజయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధృడ నాయకత్వం, అభివృద్ధి సంకల్పమే వెన్నుదన్నుగా నిలిచిందని ఐల శివరాం పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులను ఏకం చేసి, బూత్ స్థాయిలో సమన్వయం కల్పించడంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కీలక పాత్ర పోషించారని ఆయన ప్రత్యేకంగా అభినందించారు."జూబ్లీహిల్స్ ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలకు అర్హులు. ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం మరింత శక్తివంతంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తుంది. నవీన్ యాదవ్ ఘన విజయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఊపును తీసుకొచ్చింది. ఈ గెలుపు మొత్తం సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభిమానానికి ప్రతిబింబం" అని ఐల శివరాం పేర్కొన్నారు.

## మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పై ఏసీబీ దాడులు

### ఏసీబీ అధికారుల ఆధీనంలో 10 మంది డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు




మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పై ఏసీబీ దాడులు నిర్వహించింది. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై వచ్చిన ఆరోపణలపై ఏసీబీ డి.ఎస్.పి శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో ఏసీబీ అధికారులు మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కు చేరుకొని ప్రతి ఒక్కరినీ తనిఖీ చేశారు. అయితే ఈ సమయంలో పదిమంది ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉండడానికి గమనించిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిజానికి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకునే వారు మాత్రమే కార్యాలయంలో ఉండాల్సి ఉండగా కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లు ఉండదాన్ని ఏసీబీ అధికారులు గ్రహించి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అయితే డాక్యుమెంట్ రైటర్లు ఏజెంట్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసే డాక్యుమెంట్లు మాత్రమే ఉన్నాయని, వారి వద్ద నుండి ఎలాంటి డబ్బులు దొరకలేదని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఆ డాక్యుమెంట్ సంబంధించిన వారిని పిలిపించి వారి స్టేట్మెంటు రికార్డ్ చేస్తామని, ఏసీబీ అధికారుల సమక్షంలో ఉన్న పదిమంది డాక్యుమెంట్ రైటర్లు, ఏజెంట్లను విచారణ చెప్తామని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

# అక్రమ నిర్మాణం సీజ్ చేయడం..

# బిల్డర్లు తొలగించడం

- జిహెచ్ఎంసి నిబంధనను బిల్డర్లు తుంగలో తొక్కినా పట్టించుకునేది ఎవరు.?
- సీజ్ చేసిన భవనాల వద్ద ఫ్లెక్సీ ని పట్టీలను యదేచ్ఛగా తొలగింపు
- జిహెచ్ఎంసి నిబంధనలను ఉల్లంఘించిన వాళ్ళపై చర్యలు ఉండవా.?
- ప్రభుత్వ నియమ నిబంధనలు సామాన్యులకేనా.?
- అక్రమ నిర్మాణాలకు రాజకీయ మద్దతు అంటూ అధికారుల నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా వారి పేరుతో జోరుగా అక్రమ నిర్మాణాలు
- సీజ్ చేసిన భవనాలపై పర్యవేక్షణ మరిచిన సిబ్బంది, అధికారులు

బౌద్ధ నగర్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉండవా.?




ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక
స్పందించిన జోనల్ కమిషనర్ అక్రమ నిర్మాణం సీజ్
ప్రజాప్రశ్న EFFECT
ప్రజాప్రశ్న
సెటిల్మెంట్ కోసమేనా.?
సీజ్ చేయకుండా ఆపారు

సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ నియమ నిబంధనలు అంటే కొంతమందికి చులకనగా మారింది. ప్రభుత్వ అధికారుల్లో లంచగొండితనం తీవ్రం కావడంతో అసలు ప్రభుత్వ రూల్స్ పాటించకపోయిన పరవాలేదు అధికారులకు ఎంతో కొంత లంచం ఇస్తే చాలు అన్నట్లుగా మారింది ప్రస్తుత వ్యవస్థలో పరిస్థితి. ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో భారీగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు కొంతమేరకు కఠిన చర్యలు తీసుకుంటున్న వాటిని ఎలా అధిగమించాలని అక్రమ నిర్మాణదారులు(బిల్డర్లు) ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల అండ కోసం పాకలాడుతుంటే మరికొంతమంది ఎమ్మెల్యేల, మంత్రుల అండ కోసం తహతహలాడుతున్నారు. ఇక కొంతమంది ఏకంగా రాష్ట్ర ఎంపీల దృష్టికి ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారం తీసుకెళ్లి వాటిని సక్రమం చేయాలంటు, అక్రమాలకు విద్యుత్ మీటర్లు ఇప్పియ్యాలంటూ కోరుతున్నట్లు సమాచారం. చేసేదే అక్రమ నిర్మాణాల దందా ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని గండికోడుతూ అక్రమ నిర్మాణాలు చేస్తూ డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్య, బోరు నీరు సమస్య, రోడ్ల సమస్య ఇలా అన్ని సమస్యలకు మూల కారణంగా మారిన అక్రమ నిర్మాణాలను సక్రమం చేయాలంటూ ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల చుట్టూ బిల్డర్లు తిరగడం హాస్యాస్పదంగా మారింది. అవినీతికి అక్రమాలకు మద్దతిద్దాం అనుకుంటున్నారా.? ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు ఏ ప్రతిపాదికన మద్దతు ఇస్తారో వాళ్లకే తెలియాలి. మరి అక్రమాలకు మద్దతిస్తే ప్రభుత్వ రూల్స్ ఎందుకు అన్నట్టు, మున్సిపల్ చట్టాన్ని తొలగిస్తే సరిపోతుంది కదా అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. రాజకీయ నాయకులకు ప్రజాప్రతినిధులకు అవగాహన ఉంది కాబట్టి చాలావరకు వాళు ప్రభుత్వ రూల్స్ పాటించని వాటిని ఎంకరేజ్ చేయరు, కొంతమంది చేసిన అది ఎట్టి పరిస్థితిలో చెల్లదు, అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొంతమంది అక్రమ నిర్మాణదారులు (బిల్డర్లు) వాళ్లు చేసే అక్రమాలను సక్రమం చేయాలంటూ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారని సామాజిక మధ్యలలో చక్కర్లు కొడుతుంది. మరి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ నియమ నిబంధనలను కాపాడుతారా.? లేక అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతర్ చేస్తున్న (బిల్డర్ల) వాళ్లకు మద్దతిస్తారా.? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

### - భారీగా అక్రమాలకు తెగబడ్డ బిల్డర్లు

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు కొదవలేదు. చిన్న బస్తీల పేరుతో పెద్దపెద్ద భవనాలు 5, 6 అంతస్తుల అక్రమ నిర్మాణాలు చేయడం ఇక్కడ బిల్డర్లకు పరిపాటిగా మారింది. వీళ్ళ అవినీతికి మున్సిపల్ అధికారులు సై అనడంతో ఇంకేముంది ఎన్ని అక్రమ నిర్మాణాలు చేసిన అడ్డుకునేవారు లేరు, పొరపాటున పత్రికలో కథనాలు వస్తే రిపోర్టర్లని టార్గెట్ చేయడం వీళ్ళు పనిగా పెట్టుకున్నారు. అది కూడా డబ్బు ఉందన్న అతి ఉత్సాహంతో ఒక్కొక్క అక్రమ నిర్మాణం పై దాదాపు కోటి పైనే లాభాలు వస్తాయని అందుకోసమే డబ్బును చూసుకొని అధికారులను ఇటు రాజకీయ నాయకులను కొనివేస్తామంటూ బహిర్గతంగా బిల్డర్లు వాళ్ల ధన బలం చూపించుకోవడం నగరంలో పరిపాటిగా మారింది. ఎవరైనా నో అంటే వాళ్లపై అక్రమ కేసులు పెట్టడం సహజంగా మారింది. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అధికారులు అక్రమ అపార్ట్మెంట్లను సీజ్ చేసి ఫ్లెక్సీలు వేసి, సీజ్ చేసినట్లు మున్సిపల్ బ్యాండులు పెడతారు, అయితే బిల్డర్లు తమ రాజకీయ పలుకుబడితో మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన ఫ్లెక్సీలను బ్యాండ్లను యదేచ్ఛగా తొలగిస్తున్నారు. మున్సిపాల్ అధికారులు సీజ్ చేసి ఏమి ప్రయోజనమని, అక్రమాలను అడ్డుకున్న అధికారులను, ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి సీజ్ చేసిన ఫ్లెక్సీలను, బ్యాండ్లను బిల్డర్లు తొలగించడం పూర్తిగా చట్టవిరుద్ధం, మరి దీనిపై మున్సిపల్ అధికారులు ఎలా స్పందిస్తారో.? అందులో భాగంగా బౌద్ధ నగర్ డివిజన్ లో ఇంటి నెంబర్ 12%-11-%1149 రెండు అంతస్తుల అనుమతి తీసుకొని 5 అంతస్తుల భారీ అక్రమ నిర్మాణం చేశారని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకుల పేరుతో ఫ్లెక్సీలను, బ్యాండ్ లను తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అసలు మున్సిపల్ చట్టం అంటే ఎవరికి లెక్క లేనట్లుగా మారిందని ముఖ్యంగా సీతాఫలామండి బౌద్ధ నగర్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలు చేసే బిల్డర్లకు అస్సలు లేదని మున్సిపల్ అధికారులు అంటే డబ్బులిస్తే మౌనంగా ఉంటారని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తారు అన్న చులకన భావం ఏర్పడిందని అందుకోసమే ఇలా చేస్తున్నారని స్థానికుల గుసగుసలు వినిపిస్తున్నాయి మరి దీనిపై సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఎలా స్పందిస్తారో.?

### - చేసేది అక్రమ నిర్మాణాల దందా పైగా లీగల్ చేయాలట.?

ఇటీవల సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో బిల్డర్లు సమావేశం పెట్టడం, అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని అలాగే కొంతమంది రిపోర్టర్లు అక్రమ నిర్మాణాలపై వార్తలు రాస్తున్నారని వాటిని ఎలా కట్టడి చేయాలని వాళ్లు ఎత్తులు వేసినట్లు విశ్వాసనీయ సమాచారం. అయితే చేసేదే అక్రమ దందా దానికి విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు ఇయ్యాలా.? రిపోర్టర్లు రాయకూడదా.? దానికి ఎస్ఆర్ఓ లు రిజిస్ట్రేషన్ చేయాలా.? గతంలో సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో దాదాపు 100 వరకు అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు దాదాపు మూడు లక్షలకు పైగా ఒక్కొక్క రిజిస్ట్రేషన్ కు ఖర్చు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏసీబీ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేయాలని కొంతమంది స్థానిక నేతలు కోరుతున్నారు. మరి ఇంత భారీ మొత్తంలో బిల్డర్ల వద్ద నగదు ఎక్కడి నుండి వస్తుంది.? వీళ్ళ ఇన్కమ్ ఎంత.? ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ కు కడుతున్నది ఎంత.? వీళ్లకు ఫామ్ రిజిస్ట్రేషన్ ఉందా? వీళ్లు జీఎస్టీ కడుతుంది ఎంత.? జిఎస్టి లో వీళ్లు అక్రమ నిర్మాణాలను ఎలా చూపిస్తున్నారు. అపార్ట్మెంట్లు నిర్మాణానికి కమర్షియల్ అనుమతులు తీసుకుంటున్నారా.? వీళ్ళు నిర్మిస్తున్న అక్రమ అపార్ట్మెంట్లకు ఫామ్ రిజిస్ట్రేషన్ పైన అగ్రిమెంట్ జరుగుతోందా.? ఇలాంటి అనేక అనుమానాలపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ లేదా ఏసీబీ విచారణ చేపిస్తే, పూర్తిస్థాయిలో వివరాలు బయటికి వస్తాయని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

### అక్రమ నిర్మాణం సీజ్ చేయడానికి ఈ పద్ధతి వాడండి




జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను సీజ్ చేయడంలో డబుల్ గేమ్ ఆడుతున్నారా.? అందులో భాగంగా తూతూ మంత్రంగా ఫ్లెక్సీ, బ్యాండ్లు ఏర్పాటు చేయడంతో అక్రమ నిర్మాణదారులు, బిల్డర్లు రెండు రోజుల్లో వాటిని తొలగించి యదేచ్ఛగా అక్రమ నిర్మాణాల పనులు కొనసాగిస్తున్నారు. పేరుకే సీజ్ చేయడం అన్నట్లుగా మారంది పరిస్థితి. మరి దీని వెనుక అధికారులకు లంచాలు అందుతున్నాయా.? లేక చిత్తశుద్ధితో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదా అన్నది అధికారులకే తెలియాలి. ఇలా మెట్రో పిల్లర్లపై రంగులతో సూచనలు వేస్తున్న పద్ధతిని మరి టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు పాటించడం లేదు. ప్రభుత్వ నియామ నిబంధనలు కఠినంగా అమలు చేయాలనుకున్నప్పుడు సీజ్ చేసిన భవనాలకు కూడా ఈ పద్ధతిలో సూచికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసికూడా పాటించకపోవడం వెనక అంతర్యమేమిటో జిహెచ్ఎంసి కమిషనర్ కె తెలియాలి.

## ఘనంగా శ్రీరామోజు శ్రీనివాస్ - పద్మ దంపతుల పెళ్లిరోజు వేడుకలు





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు,శ్రీ వేణుగోపాల స్వామి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీరామోజు శ్రీనివాస్ - పద్మ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వారి నివాసంలో బంధువులు, మిత్రులు, స్థానిక వార్డు ప్రజల సమక్షంలో ఆనందంగా, ఘనంగా నిర్వహించుకున్నారు. పుష్పగుచ్ఛాలు అందిస్తూ, మిఠాయిలు పంచుకుంటూ వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హాజరైన బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు మాట్లాడుతూ "సామాజిక బాధ్యత, వృత్తిపరమైన నిబద్ధత, కుటుంబ పరిరక్షణముూడు అంశాలను సమతూకంగా మేళవిస్తూ సాగుతున్న శ్రీరామోజు శ్రీనివాస్ - పద్మ దంపతులు అందరికీ ఆదర్శం. ఇలాంటి సౌభాగ్య దంపతుల వివాహ వార్షికోత్సవం జరపడం మా అందరికీ ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.అలాగే వారు "శ్రీనివాస్ ఒక మంచి ఉపాధ్యాయుడే కాకుండా, సద్వ్యవహారం కలిగిన వ్యక్తి.వారి సతీమణి పద్మ కూడా అందరితో అనురాగంతో మెలిగే మృదు స్వభావం కలిగినవారు.ఇద్దరి దాంపత్యం ఇలాగే ప్రేమ,అర్థం, ఆనందాలతో నిండిపోవాలని దేవుని కోరుకుంటున్నాం" అని ఆకాంక్షించి, పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో పాల్గొన్న వారంతా దంపతులకు ఆరోగ్యం, ఆయురారోగ్యం, సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు.

# బుచ్చిబాబు మాములోడు కాదు..



టాలీవుడ్ కొత్త దర్శకుడు బుచ్చిబాబు గురించి తెలియని వారు ఉండరు. ఉప్పెన సినిమాతో 2021 లోనే సినిమా తీసి బంపర్ హిట్ అందుకున్నారు బుచ్చిబాబు. తొలి సినిమాతోనే ఇండస్ట్రీని షేక్ చేశారు. అయితే అలాంటి బుచ్చిబాబుకు మరో బంపర్ ఆఫర్ తగిలినట్లు టాలీవుడ్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది. బాలీవుడ్ కింగ్ షారూఖ్ ఖాన్ తో సినిమా చేసే అవకాశం దర్శకుడు బుచ్చిబాబుకు వచ్చిందట. అది కూడా మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో ఈ సినిమా రాబోతున్నట్లు ఓ న్యూస్ వైరల్ గా మారింది.దీంతో బుచ్చి బాబుకు బంపర్ ఆఫర్ తగిలినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే ప్రస్తుతం రాంచరణ్ తో పెద్ది సినిమా చేస్తున్నాడు బుచ్చిబాబు. ఈ సినిమా 2026 మార్చిలో రిలీజ్ కానుంది. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత మంచి టాక్ తెచ్చుకుంటే, బుచ్చిబాబు తలరాత మారనుందట. షారూఖ్ ఖాన్ తో సినిమా చేసే అవకాశాన్ని దక్కించుకోబోతున్నాడట. ఈ దిశగా మైత్రి మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రామ్ చరణ్, బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ నటిస్తున్న పెద్ది సినిమా నుంచి రిలీజ్ అయిన చికిరి చికిరి పాటకు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటకు అందరూ రీల్స్ కూడా చేస్తున్నారు. దీంతో పెద్ది సినిమా బంపర్ హిట్ అవుతుందని అంటున్నారు. అదే జరిగితే, బుచ్చిబాబు నక్కతోక తొక్కినట్లే అని అంటున్నారు.

# ఎలాంటి సమాజంలో

## జీవిస్తున్నామో ఇప్పుడే అర్థమైంది..

షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఫుల్ పాపులారిటీ దక్కించుకుని నటనపై ఆసక్తితో హీరోయిన్‌గా ఇండస్ట్రీలో కొనసాగుతోంది చాందినీ చౌదరి. 'కలర్ ఫొటో' చిత్రంలో వచ్చి మొదటి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. అప్పటినుంచి పలు చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాతో బిజీగా ఉంది. ఈ మూవీ నేడు గ్రాండ్‌గా విడుదలై.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, చాందినీ చౌదరి సోషల్ మీడియా ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఓ కార్ షోరూం వద్ద కొందరు వీధి కుక్కలను పట్టుకుని తీసుకువెళుతున్నారు. అయితే ఆ కుక్కను బంధించి ట్రాలీలో ఎక్కిస్తున్న క్రమంలో దాన్ని కింద నుంచి పైకి విసురుతున్నట్లుగా ఉంది. అందులో పట్టకపోవడంతో కుక్క కిందపడిపోతుంది.

బ్రతికి ఉన్న కుక్కను వస్తువులా ట్రీట్ చేస్తూ నిర్లక్ష్యంగా దాన్ని పైకి విసరడం చేస్తున్న వీడియోను షేర్ చేస్తూ ఫైర్ అయింది. "నోరులేని జీవాల పట్ల ఇంతటి అమానుషమా. అవి కూడా మనలాగే ప్రాణులనే విషయాన్ని చాలామంది మర్చిపోయారు. వాటిని అలా విసరడం ఎంత ఘోరమైన చర్య. వాటికి హాని కలుగుతుందనే కనీస ఆలోచన లేకుండా విచక్షణా రహితంగా ప్రవర్తిస్తున్నారు. కనీసం జంతువుల పట్ల జాలీ, దయలేని సమాజంలో మనం జీవిస్తున్నాం అని ఈ సంఘటతో అర్థమైంది" అని రాసుకొచ్చింది. ఇక ఈ ఘటన విశాఖపట్నంలోని వరుణ్ మోటార్ ముందు జరిగినట్లు తెలపడంతో పాటు మున్సిపాలిటి అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.



# ఇలాంటివి చేస్తారని

## ఇంటర్వ్యూలకి రావాలంటేనే భయమేస్తుంది

నేషనల్ క్రష్ రష్మిక ఇటీవల 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాతో ప్రేక్షకులను కన్నీరు పెట్టుకునేలా చేసింది.ఆమె నటనకు అమ్మాయిలతో పాటు సినీ సెలబ్రిటీలు సైతం ఫిదా అయిపోయారు. కానీ గత కొద్ది రోజులుగా ఆమెను నెటిజన్లు దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు. ఇటీవల చేసిన కామెంట్స్ కాస్త వివాదాస్పదమవ్వగా.. అమ్మడుని ఆడేసుకుంటున్నారు. అసలేం జరిగిందంటే.. రష్మిక 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా జగపతి బాబు హోస్ట్ చేస్తున్న జయమ్ము నిశ్చయమ్ము టాక్ షోలో పాల్గొని పలు కామెంట్లు చేసింది. కానీ ఇందులో మరీ ముఖ్యంగా.. అబ్బాయిలకు పీరియడ్స్ వస్తే ఆ బాధ వాళ్లకు తెలిసేది అని చెప్పింది. ఇక వాటిని కాస్త తప్పుగా అర్థం చేసుకున్న జనాలు ఫైర్ అవుతున్నారు. మగవాళ్లు ఎంత కష్టపడుతున్నారో చూడు.. కుటుంబాన్ని మొత్తం పోషించేది మగవారే అని మండిపడుతున్నారు. అలాంటిది మగవారిని చులకనగా మాట్లాడుతావా? అని తిడుతున్నారు. తాజాగా, ఈ విషయంపై రష్మిక స్పందిస్తూ.. "నేను అందుకే ఇంటర్వ్యూలకు రాను. ఒకవేళ వస్తే ఏదో ఒకటి అడుగుతారు. ఆ ప్రశ్నలకు నేను చెప్పిన సమాధానాలను తప్పుగా అర్థం చేసుకుని నా మీద ట్రోల్స్ చేస్తారు. ఇటీవల మగవారికి పీరియడ్స్ రావాలన్న ఉద్దేశం వేరు. కానీ వాళ్లు అర్థం చేసుకున్నది వేరే. నా కామెంట్స్‌ను కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నారు. కానీ ఎలాంటి దురుద్దేశం లేదు. ఇలాంటివి చూసినప్పుడు ఇంటర్వ్యూలకు రావాలంటేనే భయం వేస్తోంది" అని చెప్పుకొచ్చింది. కాగా.. రష్మిక త్వరలో 'మైసా' అనే పాన్ ఇండియా సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



## డివైన్ మూవీగా

# 'అనంత'


టాలీవుడ్ అగ్ర నటుడు జగపతిబాబు అలాగే సుహాసిని ప్రధాన పాత్రల్లో చేసిన డివైన్ ఫిలిం అనంత. పుట్టపర్తి సాయిబాబా ప్రేమతత్వం నేపథ్యంలో ఈ సినిమా వస్తోంది. దర్శకుడు సురేష్ కృష్ణ రూపొందించిన ఈ సినిమాను ఇన్నర్ వ్యూ బ్యానర్ పై గిరీష్ కృష్ణమూర్తి నిర్మించారు. అయితే, తాజాగా ఈ సినిమా ఆడియో అలాగే టీజర్ లాంచ్ జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు సురేష్ కృష్ణ మాట్లాడారు. ఒకరోజు గిరీష్ కృష్ణమూర్తి తనకు ఫోన్ చేశారన్నారు. బాబా గారి జీవితం పై సినిమా చేయాలని చెప్పినట్లు గుర్తు చేశారు. బాబా గారి శత జయంతి సందర్భంగా ఈ సినిమా చేయాలని కోరినట్లు తెలిపారు. దాంతో మంచి స్క్రిప్ట్ రెడీ చేసినట్లు వెల్లడించారు. భాష సినిమా లాంటి కమర్షియల్ స్క్రిప్ట్ వచ్చిందని వివరించారు. బాబా గారి గురించి ఒక బయోపిక్ చేయాలనుకున్నప్పుడు ఆయన ఆశ్రమంకు కూడా వెళ్లినట్లు గుర్తు చేశారు. దాంతో మంచి స్క్రిప్ట్ వచ్చిందని తెలిపారు. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత బాబా గారి ప్రేమ తత్వం మరింత మందికి చేరువవుతుందని కూడా ఈ సందర్భంగా వెల్లడించారు దర్శకులు సురేష్ కృష్ణ. అటు తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ, సాయిబాబా తనను నమ్మిన వాళ్లందరినీ ప్రేమించాడని తెలిపారు. ఈ సినిమా కూడా అందరూ చూడాలని, చూస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రామ జోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, ఈ సినిమా ద్వారా బాబా ప్రేమ సందేశం చాలామందికి చేరువవుతుందని వివరించారు. ఇంత మంచి ప్రాజెక్టులో ఒక ముఖ్యమైన పాట రాసే అవకాశం తనకు రావడం అదృష్టం అని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. బాబా గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా తీసిన ఈ సినివమా తప్పకుండా అందరికీ నచ్చుతుందన్నారు.



# ఫ్లాపుల ప్రవాహానికి

# బ్రేక్ పడుతుందా!

ఏడేళ్ల క్రితం మహానటి చూశాక కీర్తి సురేష్ రేంజ్ ఎక్కడికో వెళ్ళిపోతుందని అందరూ అనుకున్నారు. అందులో నటనని మరో హీరోయిన్ ఎవరూ మ్యాచ్ చేయలేరన్నది వాస్తవం. అంత ఫేమ్ తెచ్చుకున్న కీర్తి ఆ తర్వాత మహేష్ బాబు లాంటి స్టార్ హీరోతో నటించినా ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. నితిన్ లాంటి టయర్ 2 హీరోలతో నటించినా మిస్ ఇండియా అంటూ తను మాత్రమే ఉండే టైటిల్ రోల్స్ చేసినా అన్నీ దారుణంగా పోయాయి. ఇప్పుడు నెలాఖరు నవంబర్ 28 రివాల్వర్ రీటాగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇది చాలా ఆలస్యమై వాయిదాల మీద వాయిదాలు పడుతూ ఇప్పటికి మోక్షం దక్కించుకుంది. తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్ కథేంటో చెప్పేశారు. ఒక పెద్ద మాఫియా డాన్ (సునీల్) తండ్రి కనిపించకుండా పోతాడు. అతన్ని ఎవరో కిడ్నాప్ చేశారని అందరూ భావిస్తుండగా రీటా (కీర్తి సురేష్) ఇంట్లో శవమై ఉంటాడు. ఈ విషయం బయటికి పొక్కకుండా కుటుంబం మొత్తం చాలా జాగ్రత్త పడుతుంది. తల్లి (రాధికా) సహాయంతో శవం మాయం చేయాలని ప్లాన్ చేసుకుంటుంది రీటా. ఇంకోపక్క నాన్న ఏమయ్యాడో తెలియక సదరు డాన్ పిచ్చిపట్టిన వాడిలా అనుమానం వచ్చిన వాడినల్లా చంపుకుంటూ పోతాడు. చివరికి ఏమయ్యిందనేది తెరమీద చూడమంటున్నారు దర్శకుడు జెకె చంద్రు. టేకింగ్ గట్రా చూస్తుంటే మరీ కొత్తగా ఏం లేదు. నయనతార కోకో కోకిలతో మొదలుపెట్టి తరుణ్ భాస్కర్ కీడా కోలా దాకా ఇలాంటి డార్క్ కామెడీ సినిమాలు చూసిన జనాలకు రివాల్వర్ రీటా అంత కొత్తగా ఏం చూపిస్తుందో చూడాలి.



# సినిమాపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాం




విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' మూవీ భారీ అంచనాల మధ్య రేపు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర ఎంటర్‌టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. రిలీజ్ సందర్భంగా తాజాగా మీడియాతో ముచ్చటించి మరిన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఏ సినిమా చేసినా అందులో పర్పస్ ఉండాలని కోరుకునే దర్శక నిర్మాతను నేను. సినిమాలో వినోదంతో పాటు ఒక చిన్న మెసేజ్ ఏదైనా ఉండాలని ప్రయత్నిస్తాను. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమాను కూడా అలాగే ఫన్, మెసేజ్‌తో నిజాయితీగా ప్రయత్నం చేశాం. ఈ సినిమాకు ప్రీమియర్స్ ద్వారా వస్తున్న రెస్పాన్స్‌తో సంతృప్తిగా ఉన్నాం. ఇదే రెస్పాన్స్ రేపు థియేట్రికల్‌గా వస్తే ఇంకా సంతోషిస్తాం. సినిమా విజయంపై మా టీమ్ అంతా కాన్ఫిడెంట్‌గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో మంచి రిలీజ్‌తో పాటు కొన్ని సౌత్ స్టేట్స్‌లోనూ సినిమా విడుదలవుతోంది.

మన దగ్గర వచ్చే టాక్ ను బట్టి పాన్ ఇండియా స్థాయిలో సినిమాకు డిమాండ్ వస్తుందని నమ్ముతున్నాం. యూఎస్‌లో నెంబరాఫ్ లొకేషన్స్ దొరికాయి. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్ యూఎస్‌లో రిలీజ్ చేస్తున్నారు. ఫ్యామిలీతో కలిసి మా సినిమాను ఎంజాయ్ చేయెుచ్చు.. నిజాయితీగా మేము చేసిన ప్రయత్నాన్ని క్రిటిక్స్ కూడా సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం. సినిమా రిలీజ్ తర్వాత థియేటర్స్ విజిట్, సక్సెస్ టూర్స్ ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ.. 'సంతాన ప్రాప్తిరస్తు స్క్రిప్ట్.. స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండే హీరో కథ. మన తెలుగు ఆడియెన్స్‌కు నచ్చుతుందా అనే సందేహం ఉండేది. అయితే స్క్రిప్ట్ కంప్లీట్‌గా చదివాక ఎక్కడా లైన్ క్రాస్ కాకుండా, అసభ్యత లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు అందరూ చూసేలా కథ ఉంది. దాంతో ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం కలిగింది. పెద్ద హీరోలు ఇలాంటి మూవీస్ చేయరు. వారికి ఇమేజ్ అడ్డు వస్తుంది. నాలాంటి కొత్త వాళ్లే ఇలాంటి డిఫరెంట్ ప్రయత్నాలు చేయాలి. పైగా కొత్త జానర్, కొత్త కథలు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. నాలాంటి కొత్త హీరోలు రెగ్యులర్ ఫార్మేట్ మూవీస్ చేస్తే ఎవరికీ నచ్చదు. డిఫరెంట్ మూవీస్ చేయాలి, అందరికీ రిలేట్ అయ్యేలా ఉండాలి అనుకున్నా. 'సంతాన ప్రాప్తిరస్తు'లో కథ ఇన్ ఫెర్టిలిటీ అనే ఒక సెన్సిటివ్ ఇష్యూను తీసుకుని దానికి ఎంటర్‌టైన్మెంట్ యాడ్ చేశాం. సినిమా మూడొంతులు ఎంటర్‌టైన్మెంట్‌తో సాగుతుంది. చివరలో మంచి ఎమోషన్‌తో, మెసేజ్‌తో ఆడియన్స్ థియేటర్స్ నుంచి బయటకు వెళ్తారు' అని చెప్పుకొచ్చాడు.

## ఆదిలాబాద్ లో కాంగ్రెస్ ఘన నివాళి



ఆదిలాబాద్, : భారతదేశ తొలి ప్రధాని చాచా నెహ్రూ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి, కాంగ్రెస్ పార్టీకి నెహ్రూ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగేష్, లోక ప్రవీణ్ రెడ్డి, సంతోష్, మునిగేలా నర్సింగ్, సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో అండర్-17 క్రికెట్ ఎంపికలు

బోథ్, : ఆదిలాబాద్ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, ఆదిలాబాద్ లో అండర్-17 జిల్లాస్థాయి బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు %ూ+ఖీ% సెక్రటరీ రామేశ్వర్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రికెట్ కిట్టు, యూనిఫాం ను క్రీడాకారులే స్వయంగా తీసుకురావాలని సూచించారు.

## రబింద్ర ప్లే స్కూల్ లో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

ముథోల్, : మండల కేంద్రమైన ముథోల్ లోని రబింద్ర ప్లే స్కూల్ లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చాచా నెహ్రూ వేషధారణలో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లల దినోత్సవం పురస్కరించుకొని ఉపన్యాసాలు, వ్యాసరచన పోటీలలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అసంవర్ సాయినాథ్ నెహ్రూ గురించి విద్యార్థులకు వివరించారు.

## చిన్నారులే ఉపాధ్యాయులు.. పాఠాలు చెప్పి అబ్బురపరిచిన విద్యార్థులు

నిర్మల్, : నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో, ఐదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి, తోటి విద్యార్థులకు పాఠాలు, పాటలు, పద్యాలు నేర్పారు. వారి బోధనా తీరు పాఠశాల ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ స్వామి, ఉపాధ్యాయులు పోశెట్టి, కరుణ, కవిత పాల్గొన్నారు.

## ఖానాపూర్ బాయ్స్-1 పాఠశాలలో బాలల దినోత్సవం

ఖానాపూర్, : ఖానాపూర్ బాయ్స్-1 పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి పాఠశాల నిర్వహణ ఆధ్వర్యంలో నృత్యాలు, పాటలు, స్కిట్స్, ప్రసంగాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల్లో కళాత్మక ప్రతిభను పెంపొందించడానికి ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఆనందంతో పాల్గొన్నారు.

## అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్‌లో అద్భుతమైన చిల్డ్రన్స్ డే కార్నివల్

కరీంనగర్, : అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఐదు రోజుల ఫాంటాబ్యులస్ చిల్డ్రన్స్ డే కార్నివల్ ఈరోజుతో విజయవంతంగా ముగిసింది. ఈ ఐదు రోజుల వేడుక ప్రతి విద్యార్థిలోని ఆనందం, సృజనాత్మకత, మరియు నేర్చుకునే ఉత్సాహాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది. ఎర్లీ ఇయర్స్ లర్నర్స్ చేసిన ాూణ హీూణ ర్యాంప్ వాక్ ఈరోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు తమ కాన్సెప్ట్‌లు, డ్రెస్‌లు మరియు క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అందరినీ అలరించారు. గ్రేడ్ 1 నుంచి పై తరగతుల వరకు విద్యార్థులు తయారుచేసిన థీమ్-బేస్డ్ క్లాస్‌రూమ్ ఎగ్జిబిట్స్, సర్కిల్ టైమ్ ప్రెజెంటేషన్స్, మరియు సృజనాత్మక లెర్నింగ్ కార్నర్స్, ప్రతి విద్యార్థుల ఆలోచనా శక్తి, సృజనాత్మకతకు అద్దం పట్టాయి. ప్రపంచ స్థాయి విలువలతో ఎదగడానికి అద్విత విద్యార్థులకు మేము ఎల్లప్పుడూ వారితో ఉంటామని చైర్మన్ కొమరయ్య సౌగాని తెలిపారు. అనంతరం డైరెక్టర్ అనుదీప్ సౌగాని విద్యార్థులను అభినందిస్తూ, "స్వప్నాలు పెద్దవిగా పెట్టుకోండి, నేర్చుకోవడాన్ని ఆపకుండా ముందుకు సాగండి" అని ఆకాంక్షించారు. ఐదు రోజుల మహోత్సవాన్ని విజయవంతం చేసిన అందరికి ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్లక్ష్యానికి నిండుప్రాణాలు బలి

చొప్పదండి, : బుధవారం నగరంలోని కోర్టు చౌరస్తాలో అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల రవి మృతి చెందారు. ఈ ఘటనతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. నగరంలో లారీలు, ట్యాంకర్లు, ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు అతివేగంగా నడపడం వల్ల రోజుకో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కేబుల్ బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో అతని చేతులు, పక్కటెముకలు, కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ సిటీతో పాటు శివారు బైపాస్ రోడ్డులో ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

## దడ పుట్టిస్తున్న శునకాలు

మానకొండూరు, : రాజన్న సిరిసిల్ల జిల్లాలో వీధికుక్కల బెడద తీవ్రమైంది. గుంపులుగా దాడి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గత పది నెలల్లో 4642 మంది కుక్కకాటుకు గురయ్యారు. జిల్లా కేంద్రంలో ఒక కుక్క గంటలో 40 మందిపై దాడి చేసింది. వేములవాడ దేవస్థానానికి వచ్చే భక్తులు, ఇతర పనుల నిమిత్తం వచ్చేవారు కూడా బాధితులవుతున్నారు. గత సంవత్సరం ముస్తాబాద్ మండలంలో కుక్కల దాడిలో వృద్ధురాలు మరణించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కల నియంత్రణకు అధికారులు షెడ్లు నిర్మించి తరలించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు భారతి ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

హుజూరాబాద్, : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో భారతి ఫౌండేషన్ సేవలు ఎనలేనివని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య పేర్కొన్నారు. శుక్రవారం భారతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రణీత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్ కిట్లను దేవయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కిట్లు విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్ర సాంకేతిక విద్యను పెంపొందించడంలో ఉపయోగకరంగా ఉంటాయని, దేశ భవిష్యత్తుకు సాంకేతిక విద్య ఆవశ్యకత ఎంతో ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాల స్వీకరిస్తున్న భక్తులు

వేములవాడ, : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం 41 రోజుల అయ్యప్ప మాల స్వీకరించారు. అయ్యప్ప గురు స్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 60 మంది భక్తులు మాల ధరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజూ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. మాల ధరిస్తే సకల శుభాలు, కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు...

## మధుమేహ నివారణకు మంచి జీవన విధానాన్ని అనుసరించాలి

సిరిసిల్ల, : మన జీవన విధానం ద్వారానే మధుమేహ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని జిలా వైద్య, ఆరోగ్యశాఖ ఉపాధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అంతర్జాతీయ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మపురి పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ఇన్సులిన్ పని చేయని కారణంగా మధుమేహం వస్తుందన్నారు. మధుమేహం రావడానికి గల కారణాలు, నివారణ మార్గాల గురించి వివరించారు.

## బాలల దినోత్సవం

### నెహ్రూకు నివాళి, పౌష్టికాహారంపై అవగాహన

పాలేరు, : ఖమ్మం రూరల్ మండలం, ఎదులాపురం మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప కాలనీ అంగన్ వాడి కేంద్రంలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిన్న పిల్లలకు నెహ్రూ వస్త్రధారణ చేయించి వేడుకలు నిర్వహించారు. అనంతరం తల్లులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ అక్తర్ బేగం, మరియు తల్లులు పాల్గొన్నారు.

## వరి కోత తర్వాత దుబ్బులను కాల్చవద్దు

వైరా, : వరి కోత అనంతరం దుబ్బులను కాల్చకుండా నీటిలోనే కలియ దున్నాలని వ్యవసాయ అధికారి (ఏఓ) మయన్ మంజుఖాన్ రైతులకు సూచించారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వరి గడ్డిని నీటిలో దున్నడం వలన అది కేంద్రీయ ఎరువుగా మారి, తదుపరి పంటకు పోషక రూపంలో ఉపయోగపడుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మేడ రాజేష్ కూడా పాల్గొన్నారు.

## ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైనర్: పెను ప్రమాదం తప్పింది

ఖమ్మం, : శుక్రవారం వైరా మండలంలోని మహాలక్ష్మి గుడి సెంటర్ వద్ద ట్యాంకర్‌ను కంటైనర్ వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఖమ్మం నుంచి తల్లాడవైపు వెళుతున్న ట్యాంకర్ ముందుభాగం నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్లలు దాటిన పెళ్లి సందడి

మధిర, : వారంతా స్నేహితుని వివాహ వేడుకకు ఖండాంతరాలు దాటి వచ్చారు. పది రోజులపాటు సెలవు పెట్టి భారతదేశంలో కాలుమోపారు. వరుని ఇంట ముందస్తు వేడుకల్లో సందడి చేశారు. ఖమ్మం నగరం రామచంద్రయ్యనగర్‌కు చెందిన గాడిపర్తి లక్ష్మీనారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు లోహిత్‌కు ఈనెల 15న రాజమహేంద్రవరంలో హర్షిణితో వివాహం జరగనుంది. లోహిత్ జర్మనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతడి స్నేహితులైన భారతీయులు ఐదుగురు, ముగ్గురు జర్మనీ యువత యాసిన్ తస్దవర్, క్రిస్టినెబ్లె, అడిన మెర్కెల్ ఈనెల 9న భారత్‌కు వచ్చారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఒకరోజు గడిపారు. ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. లోహిత్ ఇంటి వద్ద జరిగిన హల్దీ (మంగళస్నానం) వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి నెహ్రూ: మంత్రి తుమ్మల

సత్తుపల్లి, : దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి జవహర్‌లాల్ నెహ్రూ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నెహ్రూ జయంతి సందర్భంగా కాల్వ ఒడ్డు వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెహ్రూ వారసులుగా ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశ ప్రగతిలో తమదైన ముద్ర వేశారన్నారు. దేశం లౌకిక విధానంలో అన్నదమ్ముల్లా కలిసి జీవించేలా నెహ్రూ ప్రోత్సహించారన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో, నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ ప్రజా పాలన చేస్తున్నారని పేర్కొన్నారు.

## కీచక ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

వరంగల్ ఈస్ట్, : మహబూబాబాద్ కంకర బోర్డు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో వికృత చేష్టలు, అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం ప్రధానోపాధ్యాయుడి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

## వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయం ముట్టడి

వర్ధన్నపేట, : వరంగల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో వర్ధన్నపేట చెన్నారంలో అక్రమంగా ఈత చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వర్ధన్నపేట ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామంలో అనధికారికంగా చెట్లను నరికి తరలించిన వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేయాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు అధికారులను కోరారు.

## బాలల దినోత్సవం:

### మడికొండ పాఠశాలలో కానిస్టేబుల్ జయరాజ్ సందడి



వరంగల్ వెస్ట్, : హనంకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల బాలికల, బాలుర పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ పాల్గొని పిల్లలకు జాతీయ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి బాల బాలికలే రేపటి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

## బాలల దినోత్సవం.. ఆట పాటలతో సందడి

పరకాల, : డోర్నకల్‌లోని తెలంగాణ మైనారిటీ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాలల దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చిన్నారులు ఆటా పాటతో నృత్యం చేసి సందడి చేశారు. వేడుకలను ప్రిన్సిపల్ రిజ్వాన పర్యవేక్షించారు.

## కదిలిన రైలు త్రుటిలో తప్పిన ప్రమాదం

నర్సంపేట,: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వే స్టేషన్ లో శుక్రవారం ఒక గూడ్స్ ట్రైన్ తో పెను ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న గూడ్స్ ట్రైన్ కింద నుండి వెళ్తున్న వ్యక్తి, రైలు ఒక్కసారిగా కదలడంతో పట్టాల మధ్యలో పడుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ ఘటనతో ప్లాట్ఫామ్ పై ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

## న్యుమోనియా నివారణపై నందగోకుల్ గ్రామంలో అవగాహన

మెదక్, : నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో శుక్రవారం ఆశా కార్యకర్త పుష్పలత ఇంటింటా న్యుమోనియా సర్వే నిర్వహించారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. చలికాలం నేపథ్యంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని, పిల్లల్లో జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు..

## దేశనిర్మాణంలో నెహ్రూ పాత్ర అమోఘం

నర్సాపూర్,: బాలల దినోత్సవం సందర్భంగా, శుక్రవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి నెహ్రూ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ నిర్మాణం, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నెహ్రూ తీసుకున్న విధానాలు అమోఘమని ఆయన పేర్కొన్నారు.

## ఉక్కు సంకల్పం జ్ఞాపకంగా మెదక్‌లో యూనిటీ రన్

సిద్దిపేట, : పటేల్ జయంతి సందర్భంగా మెదక్‌లో శుక్రవారం 'యూనిటీ రన్' కార్యక్రమాన్ని ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, భారతదేశంలోని అన్ని ప్రాంతాలను ఏకం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌దేనని పేర్కొన్నారు. పటేల్ ఉక్కు సంకల్పంతో నిర్మించిన ఏకతను కొందరు నేడు విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## నర్సాపూర్ నియోజకవర్గం

గజ్వేల్, : జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం మెదక్ జిల్లా నర్సాపూర్ లోని నలంద పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె పిల్లలతో కలిసి సంబరాలు జరుపుకొని, వారి ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తుపై శ్రద్ధ చూపాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆమె రాకతో స్థానికులు, జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు.

## పరిహారమివ్వకపోతే.. కార్యాలయ సామగ్రి జప్తు

దుబ్బాక, : రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి పరిహారం చెల్లించకుండా 12 ఏళ్లు కాలయాపన చేసిన పోలీస్ శాఖకు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు షాక్ ఇచ్చింది. రూ.11.46 లక్షల డిక్రీ మొత్తం చెల్లించని నేపథ్యంలో పెట్లబురుజులోని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ (పీటీఓ) కార్యాలయంలోని 20 కంప్యూటర్లు, 10 ఏసీలు, 50 స్టీల్ ర్యాకులు, 40 కుర్చీలు, టేబుళ్లు, మెయిన్ సర్వర్, యూపీఎస్‌లను జప్తు చేయాలని ఆదేశించింది. డిసెంబర్ 1లోగా జప్తు నివేదిక సమర్పించాలని పేర్కొంది. 2013 గజ్వేల్ మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సి.నర్సింలు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఘటనకు పోలీస్ వాహనం కారణమని మృతుడి భార్య పోచమ్మ, కూతురు లావణ్య కుమారులు స్వామి, రమేష్ కలిసి ఫిర్యాదు చేశారు. 2018 డిసెంబర్‌లో ట్రయల్‌కోర్టు రూ.7.85 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

## పథకం ప్రకారమే దారి దోపిడీ



హుస్నాబాద్, : జహీరాబాద్-బీదర్ అంతర్రాష్ట్ర రహదారిపై సోమవారం పట్టపగలు పాన్ మసాలా లారీని అడ్డగించి దారి దోపిడీకి పాల్పడిన కేసును సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హద్నూర్ పోలీసులు చేధించారు. హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, గ్రామీణ సీఐ హన్మంత్‌తో కలిసి వెల్లడించిన వివరాలు.. కర్ణాటకలోని బీదర్ నుంచి పాన్ మసాలా లోడుతో మధ్యప్రదేశ్ వెళుతున్న లారీని ముగ్గురు నిందితులు స్కూటీపై అనుసరిస్తూ ముఠాలోని మరో ఎనిమిది మందికి సమాచారం ఇచ్చారు. లారీ గంగ్వార్ చౌరస్తాకు చేరుకోగానే దుండగులు లారీని ఆపి.. డ్రైవర్, అందులో కూర్చున్న ఇద్దరిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం నిందితులు వెంట తెచ్చుకున్న కారులో ఆ ముగ్గురిని బలవంతంగా ఎక్కించుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్యనగర్‌కు తీసుకొచ్చి క్షౌరశాలలో బంధించారు. ఆ తర్వాత సరకును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పాన్ మసాలా తీసుకొస్తున్న యజమాని సూర్యకాంత్ ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## నెహ్రూ జయంతి సందర్బంగా మక్తల్‌లో కాంగ్రెస్ నివాళి



వనపర్తి, : భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మక్తల్ లో నెహ్రూ గంజ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు నెహ్రూ రచించిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా', 'టూవార్డ్ ఫ్రీడమ్' పుస్తకాల గురించి, పిల్లలంటే ఆయనకున్న ఇష్టం గురించి పలువురు ప్రస్తావించారు. అందుకే ఆయన జన్మదినాన్ని చిల్డ్రన్స్ డేగా జరుపుకుంటామని తెలిపారు.

# కార్యకర్తలకు,నాయకులకు పదవులు ఇవ్వరా.?

## - బీఆర్ఎస్ తరహా లోనే కాంగ్రెస్ పాలన

**కార్యకర్తలకు,నాయకులకు పదవులు ఇవ్వకుండా కాలక్షేపం**

**పార్టీ బలోపేతం కావాలంటే పార్టీ పదవులు తప్పనిసరి ఇవ్వాల్సిందే**

**గతంలో కెసిఆర్ కార్యకర్తలను, నాయకులను విస్మరించి ఓడిపోయారు**

**అధికారంలో లేనప్పుడు కార్యకర్తలే దేవుళ్ళు, వచ్చిన తర్వాత దెయ్యాలా**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల ఆశలతో తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇప్పుడు కార్యకర్తలలో అసంతృప్తి, నాయకులలో ఆవేదనతో తడిసి ముద్దవుతోంది. ఎన్నికల సమయంలో "ప్రజల ప్రభుత్వం కార్యకర్తల ప్రభుత్వం" అని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వాస్తవం కంటే నినాదాలుగానే మిగిలిపోయాయన్న అభిప్రాయం పార్టీ లోపల వినిపిస్తోంది. పార్టీ పదవుల ఆశతో విసిగిపోతున్నారు. ఈరోజు రేపు అంటూ కాలక్షేపం తప్ప పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు పదవులు కరువవుతున్నాయి.

### కార్యకర్తలే పార్టీకి వెన్నెముక కానీ వారినే నిర్లక్ష్యం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో వర్షం, ఎండా తేడా లేకుండా ప్రచారం చేసిన, జెండా మోసిన, గ్రామం గ్రామం తిరిగిన నిజమైన కార్యకర్తలు ఇప్పుడు పక్కన పడిపోయారు. పదవులు, గౌరవం, బాధ్యతలు కొద్దిమంది లాబీబలులు, ప్రియమైన వర్గాలకు మాత్రమే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. వీళ్లే పార్టీ భవిష్యత్తుకు బీజం వేసినప్పటికీ, ఇప్పుడు పార్టీ వ్యవస్థలో తమకు స్థానం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "పదవులు ఇవ్వకపోయినా మాకు గుర్తింపు ఇవ్వండి, పార్టీ కోసం ప్రాణం పెట్టిన మమ్మల్ని మర్చిపోకండి" అని మండల, పట్టణ స్థాయి కార్యకర్తల, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రేవంత్ రెడ్డి పాలనలో కేసీఆర్ ముద్ర.?

ఒకప్పుడు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఎదుర్కొన్న ప్రధాన విమర్శ – కార్యకర్తల, నాయకుల నిర్లక్ష్యం, వర్గపోకడలు, లాబీయిజం.ఇప్పుడు అదే మార్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా.? అనే ప్రశ్న పార్టీ లో అంతర్గతంగా గట్టిగా వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా కార్యక్రమాలు, పర్యటనలు చేస్తున్నా, పార్టీ వ్యవస్థలో చైతన్యం కరువవుతోందన్నది వాస్తవం.

### సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు..

కేసీఆర్ మాదిరి చుట్టూ కొద్దిమంది సలహాదారులు, నమ్మినవాళు ఉంటే చాలు అనుకుంటే, అది కాంగ్రెస్ పతనానికి మొదటి మెట్టు అవుతుంది.

### పార్టీ అధ్యక్షుడు, ఇన్‌చార్జ్‌లు ఎక్కడ.?

ప్రాంతీయ నాయకులు, గ్రామ స్థాయి అధ్యక్షులు నేరుగా ప్రశ్నిస్తున్నారు
"రాష్ట్ర ఇంచార్జి,పార్టీ అధ్యక్షుడు పరిస్థితులు తెలుసుకుంటున్నారా.? గ్రౌండ్ స్థాయి వాస్తవాలు వారికీ తెలియవా.?జిల్లా, మండల కమిటీల్లో గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి చాన్స్ ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### పదవి లేకుండా ఉత్సాహం తగ్గిపోతుంది..

కాంగ్రెస్ పార్టీ శక్తి అదే కార్యకర్త లు, నాయకులు కానీ పదవులు, గుర్తింపు లేకుండా ఆ ఉత్సాహం ఎక్కువ రోజులు నిలవదు. ఇప్పుడు చాలా మంది నాయకులు "ఇకపై పార్టీ కోసం పనిచేయడం అంత సులభం కాదు అంటున్నారు. వారికి లభించేది ఆశలు మాత్రమే, ఫలితాలు మాత్రం చీకట్లో కలిసిపోతున్నాయి.

### పార్టీని కాపాడేది కార్యకర్తలే..

కాంగ్రెస్ చరిత్ర చెబుతోంది ఏమంటే, పార్టీకి జీవం పోసేది సామాన్య కార్యకర్తలు, నాయకులే. వారిని నిర్లక్ష్యం చేయడం అంటే పార్టీకి పునాది తీయడం వంటిది.రాబోయే ఎన్నికల్లో పార్టీ తిరిగి గెలవాలంటే ఇప్పుడు నుంచే ఈ అసంతృప్తిని చల్లార్చాలి.

### కేసీఆర్ లాగా కాకుండా రేవంత్ భిన్నంగా నిరూపించుకోవాలి..

ప్రజలు బీఆర్ఎస్‌ను వెనక్కు నెట్టారు. ఎందుకంటే పాలనలో అహంకారం, కార్యకర్తల, నాయకుల నిర్లక్ష్యం ఎక్కువైంది. అదే దారి కాంగ్రెస్ పడితే, చరిత్ర మళ్లీ తిరిగి రాయడం ఖాయం.కార్యకర్తలు, నాయకులు పార్టీ పునాది. వారిని చులకన చేయడం అంటే ఆ పునాదినే బలహీనపరచడమే. "కార్యకర్తలే కాంగ్రెస్ శ్వాస వారిని కాపాడితేనే పార్టీ బ్రతుకుతుంది.

# ఫ్యాన్సీ నెంబర్ల వేలం

## -రవాణాశాఖకు రూ. 65 లక్షల ఆదాయం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫ్యాన్సీ నెంబర్ల వేలం ద్వారా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖకు భారీ ఆదాయం సమకూరింది. ఒక్కరోజులో ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి రూ.65,38,889ల ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ తెలిపారు. వివిధ ఫ్యాన్సీ నెంబర్లను పలువురు ప్రముఖులు దక్కించుకున్నట్లు ఆయన వెల్లడించారు. అత్యధికంగా టీజీ09హెచ్ 9999 నెంబర్‌కు రూ. 22,72,222లు పలికింది. అతితక్కువగా టీజీ09జే 0003 నెంబరుకు రూ. 1,15,121 ఆదాయం వచ్చింది. టీజీ09హెచ్ 9999 నెంబర్‌ను రూ. 22,72,222లకు హానర్ ప్రైమ్ హౌసింగ్ ఎల్ఎల్‌పీ అధినేతలు దక్కించుకున్నారు. టీజీ09జే 0009 నెంబర్‌ను రూ.6,80,000లకు మెస్సర్స్ దండు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం, టీజీ09జే 0006 నెంబర్‌ను రూ.5,70,666లకు సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ యాజమాన్యం, టీజీ09జే 0099 నెంబర్‌ను రూ. 3,40,000లకు మెస్సర్స్ గోదావరి ఫార్చ్యూన్ సంస్థ, టీజీ09జే 0001 నెంబర్‌ను రూ. 2,60,000లకు శ్రీనిధి ఐటీ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకున్నాయి.టీజీ09జే 0005 నెంబర్?ను రూ.2,40,100లకు నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, టీజీ09జే 0018 నెంబర్‌ను రూ.1,71,189లకు రోహిత్ రెడ్డి ముత్తు, టీజీ09జే 0007 నెంబర్‌ను రూ.1,69,002లకు కొండవరపు శ్రీనివాస్ నాయుడు, టీజీ09జే 0077 నెంబర్‌ను రూ.1,41,789లకు మీనాక్షి పవర్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీ09జే 0123 నెంబర్‌ను రూ.1,19,999లకు ఆకుల మాధురి, టీజీ09జే 0003 నెంబర్‌ను రూ.1,15,121లకు జీఎస్.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కైవసం చేసుకుంది.

# జూబ్లీహిల్స్ తీర్పుతో బీఆర్ఎస్ పార్టీకి సెలవు

## - రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చోటు లేదన్న మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి సెలవు ప్రకటించారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చోటులేదని మరోసారి రుజువైందని అన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. నవీన్ యాదవ్‌ను గెలిపించిన ఘనత ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది అని అన్నారు.

# ఉగ్రవాదులకు అడ్డాగా మారిన హైదరాబాద్

# - ఇంకెంత కాలం ఈ నరమేధం

**- దేశంలో ఏ మూల ఉగ్రదాడులు, విధ్వంసాలు జరిగినను మూలాలు మాత్రం హైదరాబాద్ తో లింకులు**

**- అభివృద్ధితో పాటు తీవ్రవాదంతో ప్రపంచ వ్యాప్తంగా వార్తల్లో నిలిచిన మన హైదరాబాద్**

**- అత్యంత సులువుగా తీవ్రవాదులకు నగరంలో దొరుకుతున్న ఆశ్రయం**

**- పాతబస్తీలో పటిష్టవంత మైన పోలీసు వ్యవస్థ అమలుకానందునే ఉగ్రవాదులకు బలం చేకూరుతుందా.?**

**- రాజకీయ లబ్దికోసం పాతబస్తీపై కొరవడిన నిఘానా.?**

**- నిత్యం కార్డన్ సెర్చ్ తో పాటు ఉగ్రవాదుల కదలికలపై కన్నేయాలి**

**- తెలంగాణ పోలీస్ వ్యవస్థ అద్భుత పనితీరు వల్లే హైదరాబాద్ నగరం సురక్షితంగా ఉందనడంలో అనుమానం లేదు.**







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అభివృద్ధి పథంలో ఉరకలేస్తు విశ్వనగరం రేసులో దూసుకుపోతున్న హైదరాబాద్ మహనగరం దేశం లోని ముఖ్యమైన నగరాలలో ఒకటి. అయితే అన్నింటికి మించి ఉగ్రవాదులకు అడ్డాగా మారిందని ఇప్పుడు కొత్తగా వినిపిస్తున్న మాట. దేశంలో ఏ మూల తీవ్రవాద దాడులు వెలుగు చూసిన మూలాలు మాత్రం హైదరాబాద్ తో ముడిపడి ఉండడం గమనార్హం. తీగలాగితే డొంక కదిలేది మన హైదరాబాద్ నగరం లోనే. దీంతో హైదరాబాద్ మహనగరం ఉగ్రవాదుల ప్యాక్టరీగా మారిందా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తీవ్రవాద విషయంలో దేశంలోని ఏ నగరానికి లేని ప్రత్యేకత మన హైదరాబాద్ కు మాత్రమే ఎందుకు అనే ప్రశ్నకు సమాధానం లేదు. అయితే కారణాలు ఏమైనను అభివృద్ధితో పాటు తీవ్రవాధం విషయంలో హైదరాబాద్ పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగుతుండడం గమనార్హం. తీవ్రవాధులను తయారు చేయడంలోనే కాక తీవ్రవాద పీడిత నగరాలలో హైదరాబాద్ ది ప్రథమస్థానమే. ఇక్కడ నగరంలో మతకలహాలు సృష్టించడం చాలా తేలిక అని, తీవ్రవాదులకు ఇక్కడ ఆశ్రయం దొరుకుతుందనడం లో సందేహం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పాతనగరంలో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరుకుచున్నను నగరంలోని ఇతర ప్రాతాలలో లేరని చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. విచిత్రమేమంటే ఎప్పటి నుండో హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ అనే ట్రెండ్ కొనసాగుతుండడంతో తీవ్రవాదులు చుట్టం చూపుగా నగరానికి వచ్చి పోతు తమ కార్యకలాపాలను చక్క పెట్టుకుంటున్నరనడంలో అనుమానం లేదు. ఇక పోతే తెలంగాణ పోలీస్ శాఖ సమర్ధవంతమైన పనితీరు వల్లనే హైదరాబాద్ నగరం ఇంక సరక్షితంగా ఉందని చెప్పవచ్చు. అయితే హైదరాబాద్ లో ఎప్పుడంటే అప్పుడే తీవ్రవాదులు పట్టు పడుతుండడంతో ఆందోళణ కలిగిస్తున్న విషయం. ప్రభుత్వాలు మారుచున్నను పాతబస్థీలోని పలు ప్రాంతాలలో పటిష్టవంతమైన పోలీసింగ్ వ్యవస్థ అమలు కావడం లేదు. పాతబస్థీలో తీవ్రవాద ప్రాబల్యం ఉన్న ప్రాంతాలు నిత్యం పోలీసులకు సవాలుగా మారాయి. ఏ రాజకీయ పార్టీ అయినను తమ రాజకీయ ప్రాబల్యం కోసం పాతబస్థీ ని చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఆయా ప్రాంతాలలో తీవ్రవాద కదలికలు బలం పుంజు కుంటున్నాయనడంలో అనుమానం లేదు. అయితే ఒకప్పటి పరిస్థితులు వేరు నేటి పరిస్థితులు వేరు.

ప్రపంచ వ్యాప్తంగా కోరలు చాచిన ఉగ్రవాదం వికటహసం చేస్తు విద్వాంసాలు సృష్టిస్తుంది.

అయితే గతంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుండి అక్రమ చొరబాట్లకు పాల్పడే ఉగ్రవాదులతో భారత్ కు ముప్పుగా పరిణమించేది. కాని అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. పెరిగిన టెక్నాలజీతో ఎవరు ఎక్కడికి కదలకుండనే అంతా జరిగిపోతుంది. ప్రపంచాన్ని వణికిస్తున్న ఉగ్రవాదం ఎక్కడ ఎలా కావాలంటే అలా విధ్వంసం సృష్టించగలదు. కాని ఎన్.ఐ.ఏ సమర్థవంతమైన స్పందన లేకుంటే హైదరాబాద్ నగరం తీవ్రవాద దాడులతో విలవిలలాడే పరిస్థితులు దాపురించేవి. ఇకపోతే ఈ మద్య కార్డన్ సెర్చ్ పేరుతో హైదరాబాద్ పోలీసులు చేస్తున్న కార్యక్రమం అద్భుతంగా ఉన్నను, గ్రేటర్ హైదరాబాద్ లో గత కొంతకాలంగా కార్డెన్ సెర్చ్ చేయడం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఇదే సమయంలో ఉగ్రవాదల కదలికలపై కూడా ఓ కన్నేసి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విశ్వనగర రేసులో దూసుకుపోతు అభివృద్దిలో అంతకంతకు ఎదుగుతు అందనంత ఎత్తుకు చేరిన హైదరాబాద్ మహనగరంలో మళ్ళీ ఉగ్రదాడుల విద్వంసం అనే మాట వినడానికి ప్రజలు సిద్దంగా లేరు. ఎందుకంటే అన్ని సార్లు అదృష్టం కలిసి రాదు. అప్రమత్తతే ఆయుధం.

# చంద్రబాబు ఒక విజనరీ సీఎం

## - ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డ అదృష్టవంతుడే



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ప్రసంగించారు. ఏపీ సీఎం చంద్రబాబు కేవలం రాష్ట్ర అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా యావత్ భారతదేశ ప్రగతి గురించి ఆలోచించే దార్శనిక నాయకుడు (విజనరీ సీఎం) అని ప్రశంసించారు. చంద్రబాబు వంటి నాయకుడు ఉన్న ఏపీలో పుట్టిన ప్రతి బిడ్డ అదృష్టవంతుడని, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆయన కొనియాడారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో ఆంధ్రప్రదేశ్ సాంకేతికంగా, ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని పీయూష్ గోయెల్ విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం ఒక 'గ్లోబల్ ట్రేడ్ గేట్‌వే'గా నిలుస్తోందని, స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. వాణిజ్య ప్రదర్శనలు, సదస్సుల కోసం ఢిల్లీలో నిర్మించిన 'భారత్ మండపం' తరహాలో 'ఆంధ్రా మండపం' నిర్మించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.2047 నాటికి భారతదేశాన్ని ఒక సుసంపన్న దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారానే ఈ ప్రగతిని సాధిస్తామని గోయెల్ తెలిపారు. 'టెక్నాలజీ డెమొక్రటైజేషన్' విధానంతో టెక్నాలజీని అందరికీ చేరువ చేస్తున్నామని చెప్పారు. భారత్ ప్రవేశపెట్టిన డిజిటల్ చెల్లింపుల విధానాన్ని నేడు అనేక దేశాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. 30 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో దేశంలో సెమీ కండక్టర్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని, 104 శాటిలైట్లను ఒకేసారి ప్రయోగించి సాంకేతిక సత్తా చాటామని అన్నారు.'వసుధైక కుటుంబం' అనే భారతీయ భావనకు అనుగుణంగా, కోవిడ్ సమయంలో 110 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసి భారత్ తన గొప్పతనాన్ని నిరూపించుకుందని గుర్తుచేశారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నామని వివరించారు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుంటూ వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తున్నామని, జీఎస్టీ వంటి సంస్కరణలతో ఆర్థిక అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన స్పందించారు. వస్తున్న ఫలితాలు ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజలకు ఉన్న అపారమైన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. మోదీ నాయకత్వంపై నమ్మకం ఉంచి, ఎన్డీఏకు మద్దతుగా నిలుస్తున్న బీహార్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అత్యంత పారదర్శకమైన వాణిజ్య విధానాలను తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సీఐఐ వంటి సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆవిష్కరణలు రావడం అభినందనీయమని పీయూష్ గోయెల్ పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588